

న్యూస్ బాక్స్

తప్పులు లేకుండా నమోదుచేయాలి


కాల్వశ్రీరాంపూర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే డాటా ఎంట్రీలో తప్పులు దొర్లవద్దని ఆర్డీవో గంగయ్య సూచించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో జరుగుతున్న సర్వే డాటా ఎంట్రీ పనులను ఆయన పరిశీలించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో సర్వే డాటా ఎంట్రీ నమోదు ప్రక్రియ చేపట్టారని తెలిపారు. డాటా ఎంట్రీలో ఎటువంటి తప్పులు దొర్లకుండా చూడాలన్నారు. డాటా ఎంట్రీ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. మండలంలో 24గ్రామాల్లో నిర్వహించిన సర్వే వివరాలను 30 మంది ఎన్యూమరేటర్లు ఎంట్రీ చేస్తున్నారన్నారు. మూడు రోజులుగా డాటా ఎంట్రీ పనులు వేగవంతంగా నడుస్తున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఎండి.వకీల్, డిప్యూటీ తహసీల్దార్ శంకర్, ఎంపీడీవో రామ్మోహనాచారి, ఎంపీవో గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ నాయకుడి మృతి తీరని లోటు

కళ్యాణ్‌నగర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): సీపీఐ ఖమ్మం జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ మృతి పార్టీకి తీరనిలోటని రామగుండం సీపీఐ నగర అధ్యక్షుడు కనక రాజు ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థి దశ నుంచి ఏఐఎస్ఎఫ్‌లో పని చేసిన ప్రసాద్ విద్యుత్ ఉద్యమంలో ధైర్యంగా పోలీసులను ఎదుర్కొని అరెస్టు అయ్యారని పేర్కొన్నారు. సమస్యలను పరిష్కరించే విధంగా నిత్యం ప్రజల మధ్య ఉండే ప్రసాద్ విద్యార్థి, యువజన సంఘాలకు దిశా నిర్దేశం చేసేవారని పేర్కొన్నారు. పోటు ప్రసాద్ మృతి సీపీఐకి తీరని లోటన్నారు.

- సింగరేణిలో అన్‌ఫిట్ల పేరిట భారీగా వసూళ్లు
- పనులు కాకున్నా కల్లబొల్లి మాటలతో కాలయాపన
- రామగుండంలో పోలీసులను ఆశ్రయిస్తున్న బాధితులు

కొలువుల దందా



కోల్‌సిటీ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో కొందరు దళారులు ఉద్యోగాలు పెట్టిస్తామంటూ దందాను సాగిస్తున్నారు. సింగరేణి, ఎన్టీపీసీ, మున్సిపల్ కార్పొరేషన్‌లలో పనులు పెట్టిస్తామంటూ కోట్ల రూపాయలు అమాయకుల నుంచి వసూలు చేశారు. పరిస్థితులు తారుమారై పనులు కాకపోవడంతో తీసుకున్న డబ్బులు వాపసు ఇవ్వకుండా కల్లబొల్లి మాటలు చెప్పి కాలయాపన చేస్తున్నారు. లక్షల రూపాయలు వడ్డీలకు తెచ్చి దళారులకు ఇచ్చిన బాధితులు మోసపోయామని తెలిసి తలలు పట్టుకుంటున్నారు. ఒక్కొక్కరుగా బయటకు వస్తున్న బాధితులు కొందరు దళారులను నిలదీస్తుంటే.. మరికొందరు పోలీసులను ఆశ్రయిస్తున్నారు. వారం రోజులుగా ఇలాంటి వరుస ఘటనలు పారిశ్రామిక ప్రాంతంలో చర్చనీయాంశం అవుతున్నాయి.

● వరంగా మారిన మెడికల్ అన్‌ఫిట్లు..

రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో సింగరేణిలో మెడికల్ అన్‌ఫిట్లు దళారులకు వరంగా మారాయి. ప్రధాన కార్మిక సంఘాల నాయకులు, వైద్యులు, చోటామోటా ట్రేడ్ యూనియన్ నాయకులు వసూళ్లకు ఏజెంట్లను పెట్టుకున్నారు. మెడికల్ బోర్డుకు దరఖాస్తు చేసుకున్న వారి జాబితాను పట్టుకుని ఇళ్ల చుట్టూ తిరిగి బేరాలాడుకుంటున్నారు. సింగరేణిలో పని చేసిన ఒక కీలక మెడికల్ అధికారితో సంబంధాలున్నాయని దళారులు చెప్పుకుంటూ కోట్ల రూపాయలు వసూలు చేశారు. ట్రేడ్ యూనియన్ నాయకులు ప్రతి బోర్డులో తమ కోటా ఉంటుందంటూ నమ్మిస్తూ కోట్లు గడించారు. నడవలేని స్థితిలో ఉన్నవారు, గుండె జబ్బులు ఉన్నవారు, బైపాస్ సర్జరీలు అయినవారు సైతం మెడికల్ అన్‌ఫిట్లు కావాలంటే డబ్బులు ఇవ్వాలంటూ నమ్మించారు. గతంలో సగానికి పైగా అర్హులను అన్‌ఫిట్లు చేశారు. దీన్ని కూడా తమ ఖాతాల్లో వేసుకుని తామే అన్‌ఫిట్లు చేయించామంటూ బాధితుల నుంచి డబ్బులు గుంజారు. అన్‌ఫిట్ కాని వారికి పనికాలేదని, మరో బోర్డులో చేయిస్తామంటూ నమ్మిస్తూ కాలయాపన చేస్తున్నారు. మెడికల్ బోర్డులో బ్రోకర్లుగా మారిన సాధారణ కార్మికులు కొందరు అనతి కాలంలోనే కోట్లు కూడగట్టారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో మెడికల్ బోర్డులో పరిస్థితులు మారాయి. దీంతో అర్హులనే అన్‌ఫిట్ చేయడంతో మోసగాళ్లకు చెక్ పడింది. పైరవీకారులకు డబ్బులు ఇచ్చిన కార్మికులు అన్‌ఫిట్ కావడం లేదు. వరుసగా మెడికల్ బోర్డుల్లో ఈ పరిస్థితి

మిగతా 8వ పేజీలో...

కేసులు వద్దు... డబ్బులు ఇప్పించండి..

ఉద్యోగాల పేరుతో మోసపోయిన బాధితులు పోలీసులను ఆశ్రయిస్తూనే తమ వద్ద డబ్బులు తీసుకున్న వారి నుంచి డబ్బులు ఇప్పించాలని, కేసులు వద్దంటూ పోలీసులను కోరుతున్నారు. కేసులు పెడితే స్టేషన్ బెయిల్ తీసుకుని డబ్బులు ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నారని పేర్కొంటున్నారు. దీంతో ఈ వ్యవహారం పోలీసులకు సైతం తలనొప్పిగా మారింది. కొన్ని సందర్భాల్లో మోసగాళ్లకు పోలీస్ మార్క్ కౌన్సెలింగ్ ఇస్తున్నారు. దీంతో వాయిదాలు పెట్టి డబ్బులు చెల్లిస్తున్నారు. ఉన్నతాధికారులు కూడా ఈ విషయంలో కింది స్థాయి అధికారులకు కొంత వెసులుబాటు కల్పించారు.

పీడీ యాక్టుకు వైట్ కాలర్ నేరస్థుల జాబితా..

కోల్‌బెల్ట్‌లో ఉద్యోగాల పేర మోసం చేసి డబ్బులు దండుకున్న పలువురు వైట్‌కాలర్ నేరస్థులకు సంబంధించి రామగుండం కమిషనరేట్‌లో జాబితా సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే భూకబ్జాదారులపై పీడీ యాక్టు పెట్టిన పోలీసులు ఇప్పుడు వైట్‌కాలర్ నేరస్థులపై సైతం దృష్టి సారించారు. ఎవరెవరిపై ఫిర్యాదులు ఉన్నాయి, ఎంత మంది వద్ద డబ్బులు తీసుకున్నారనే విషయాలపై ఠాణాల వారీగా వివరాలు సేకరిస్తున్నారు. కొందరిపై పీడీ యాక్టు పెట్టేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు.

పెద్దకల్వలలో నిరుద్యోగ విజయోత్సవ సభ

● డిసెంబర్ 4న జిల్లాలో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన

● కలెక్టర్ శ్రీహర్ష ● స్థలాన్ని పరిశీలించిన కలెక్టర్, ఎమ్మెల్యే



స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

పెద్దపల్లి, నవంబర్ 27 (ఆంధ్రజ్యోతి) : పెద్దపల్లిలో డిసెంబర్ 4న యువతతో జరగనున్న విజయోత్సవ సభ పెద్దకల్వలలోని కలెక్టరేట్ ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో జరుగుతుందని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో సభ నిర్వహణకు పెద్దకల్వలలోని కలెక్టరేట్ ఎదురుగా ఉన్న ఖాళీ స్థలాన్ని బుధవారం పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావుతో కలిసి కలెక్టర్ కోయ శ్రీహర్ష పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ ముఖ్యమంత్రి సభ నేపథ్యంలో స్థలాన్ని శుభ్రం చేయాలని, గురువారం ఉదయం స్టేజ్ ఏర్పాటు కోసం హైదరాబాద్ నుంచి బృందం వస్తుందన్నారు. డిసెంబర్ 4న జిల్లాలో యువతతో విజయోత్సవ సభ జరగనుందన్నారు. పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు మాట్లాడుతూ విజయోత్సవ సభకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరుకానున్నారని, సభలో గ్రూప్-4, ఇతర పోటీ పరీక్షల్లో ఎంపికైన 9 వేల మంది అభ్యర్థులకు ఉద్యోగ నియామక పత్రాలను పంపిణీ చేస్తారని తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో సభ నిర్వహణకు పెద్దకల్వలలోని ఖాళీస్థలాన్ని ఎంపిక చేశామన్నారు. జిల్లాలో ఉన్నతాధికారులు అప్రమత్తంగా ఉంటూ ముఖ్యమంత్రి పర్యటన విజయవంతం చేసేందుకు పక్కా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సూచించారు. పెద్దపల్లి ఆర్డీవో బీ గంగయ్య, మున్సిపల్ కమిషనర్ వెంకటేష్, తహసీల్దార్ రాజ్‌కుమార్, ఈఈ ఆర్‌అండ్‌బీ భావ్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో మంత్రి పూజలు



ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

యైటింక్లయిన్‌కాలనీ, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): సుందిల్ల లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు బుధవారం పూజలు చేశారు. ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా స్వాగతం పలికారు. ఆలయ ఆవరణలో శ్రీవిఖన సుదర్శా సేవా సమితి ఆధ్వర్యంలో జరుగుతున్న సర్వకామప్రద సుదర్శన సహిత లక్ష్మీనృసింహ యాగ వైభవ కార్యక్రమంలో శ్రీధర్‌బాబు పాల్గొన్నారు. ప్రాచీన చరిత్ర ఉన్న సుందిల్ల లక్ష్మీనరసింహ ఆలయ అభివృద్ధికి కృషి చేయనున్నట్టు మంత్రి తెలిపారు.

బ్యాక్ వాటర్ నిర్వాసితులకు పరిహారం ఇప్పించాలి

యైటింక్లయిన్‌కాలనీ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): సుందిళ్ల ప్రాజెక్టు బ్యాక్ వాటర్‌లో ముంపునకు గురవుతున్న సుందిళ్ల, జనగామ గ్రామాల నిర్వాసితులకు నష్టపరిహారం, పంట పరిహారం ఇప్పించాలని నిర్వాసితులు మంత్రి శ్రీధర్‌బాబును కోరారు. బుధవారం సుందిళ్ల గ్రామానికి మంత్రి శ్రీధర్‌బాబు రాగా నిర్వాసితులు మందల బక్కిరెడ్డి, దేవేందర్‌రెడ్డి, నారాయణ, వెంకన్న, లక్ష్మణ్‌కుమార్, రుద్రభట్ల వామన్‌రావు, గోపాల్, గర్రెపల్లి వెంకన్నగౌడ్‌లు మంత్రిని కలిసి వినతి పత్రం అందజేశారు. రెండు గ్రామాల్లో 192ఎకరాలు భూ సేకరణకు నోటీసులు ఇచ్చారని, రెండు మూడు సార్లు సమావేశాలు నిర్వహించి విచారణ కూడా నిర్వహించారన్నారు. ఆర్డీవో తమ భూముల రేటును పూర్తిగా వ్యతిరేకించారన్నారు. ఐదేళ్లుగా తమ భూములు నీట మునగడం వల్ల పంటల నష్టం కూడా జరుగుతోందన్నారు. ప్రభుత్వం పంటలకు కూడా పరిహారం ఇవ్వడం లేదన్నారు. వెంటనే జోక్యం చేసుకుని తగిన పరిహారం ఇప్పించాలని కోరారు.

ఆశ్రమాలకు మోక్షమెప్పుడో..?

- నత్తనడకన వృద్ధుల, అనాథ ఆశ్రమ భవనాల నిర్మాణ పనులు
- కలెక్టర్ ఆదేశాలు సైతం బేఖాతరు..



పునాదులకే పరిమితమైన వృద్ధాశ్రమ భవనం

7

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ గెలుపునకు కృషి

- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సురేష్‌రెడ్డి



మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సురేష్‌రెడ్డి

8

గ్రంథాలయాల ఆధునికీకరణకు చర్యలు

- జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అన్నయ్యగౌడ్



మాట్లాడుతున్న అన్నయ్యగౌడ్

సుల్తానాబాద్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని గ్రంథాలయాల ఆధునికీకరణకు కృషి చేస్తామని, అందుకు తగిన ప్రణాళికలు రూపొందిస్తున్నామని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్యగౌడ్ అన్నారు. మండలంలోని గర్రెపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన లైబ్రరీని సుల్తానాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ మినుపాల ప్రకాష్‌రావుతో కలిసి ఆయన బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంత్రి శ్రీదర్‌బాబు, ఎమ్మెల్యేల సహకారం ప్రోత్సాహంతో జిల్లాలోని అన్ని లైబ్రరీలను ఆదునికీకరిస్తామన్నారు. యువతకు ముఖ్యంగా నిరుద్యోగులకు పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలను అందుబాటులో ఉంచుతామన్నారు. లైబ్రరీల్లోని పుస్తకాలను డిజిటలైజ్ చేసేందుకు చర్యలు తీసుకుంటామని, పాఠకులకు తగిన వసతి సౌకర్యాలు కల్పిస్తామన్నారు. అన్ని లైబ్రరీలకు స్వంత భవనాలు నిర్మించాలనే ఆలోచన ఉందని, ముందుగా జిల్లాకేంద్రంలో స్వంత భవన నిర్మాణం చేపడుతామని, ఆరు కోట్ల రూపాయలతో భవన సముదాయం నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. జిల్లాలో సుల్తానాబాద్, మంథనిల్లో మాత్రమే స్వంత భవనాలున్నాయని తెలిపారు. జిల్లా గ్రంథాలయ సంస్థకు మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీల నుంచి దాదాపు నాలుగు కోట్ల లైబ్రరీ సెస్ నిధులు రావాల్సి ఉందని, వాటి వసూలుకు కృషి చేస్తూ వసతులు కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు ఎంపీటీసీలు సత్యనారాయణరావు, బొల్లం లక్ష్మణ్, పులి వెంకటేశంగౌడ్, సింగిల్‌విండో మాజీ చైర్మన్ కల్లెపల్లి జానీ, మాదాసు వెంకన్న పటేల్, ఎంపీడీవో దివ్యదర్శన్‌రావు, సహకార సంఘం వైస్‌చైర్మన్ దీకొండ శ్రీనివాస్, చక్రపాణి పాల్గొన్నారు.

కొనుగోలు చేసిన ధాన్యం త్వరగా తరలించాలి

● ధాన్యం వివరాల నమోదును వంద శాతం పూర్తి చేయాలి ● కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లి రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం కొనుగోలు కేంద్రానికి వచ్చిన ధాన్యం తేమ శాతం 17 రాగానే కొనుగోలు చేసి త్వరగా తరలించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. బుధవారం కలెక్టర్ కోయ శ్రీహర్ష పెద్దపల్లి మండలంలోని అప్పన్నపేట గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలకు వచ్చే ధాన్యం నాణ్యతను నిరంతరం పరిశీలించాలన్నారు. ధాన్యం తేమ శాతం 17రాగానే వెంటనే కొనుగోలు చేసి, సెంటర్‌కు కేటాయించిన రైస్ మిల్లులకు త్వరగా తరలించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో కొనుగోలు చేసిన ధాన్యానికి రైతులకు సకాలంలో చెల్లింపులు జరిగేలా చూడాలని, వందశాతం కొనుగోలు ధాన్యం వివరాల ట్యాబ్ ఎంట్రీ పూర్తిచేయాలని సూచించారు. రైస్‌మిల్లుల వద్ద ఎటువంటి కోతలు లేకుండా చూడాలన్నారు.



అప్పన్నపేటలో వివరాలు అడిగి తెలుసుకుంటున్నకలెక్టర్ శ్రీహర్ష

ఖనిలో జనరల్ ఆసుపత్రిలో తొలి ల్యాప్రోస్కోపిక్ ఆపరేషన్



ల్యాప్రోస్కోపిక్ ఆపరేషన్ నిర్వహించిన వైద్యులు, సిబ్బంది

కళ్యాణ్‌నగర్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ల్యాప్రోస్కోపి ద్వారా ఓ బాలుడికి అరుదైన ఆపరేషన్ విజయవంతంగా నిర్వహించారు. గోదావరిఖనికి చెంది న కే అశ్విత్ అనే బాలుడు కొద్ది రోజులుగా కడుపునొప్పితో బాధ పడుతుండగా బుధవారం జనరల్ ఆసుపత్రిలో డాక్టర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో బాలుడికి ఆపరేషన్ నిర్వహించారు. జనరల్ సర్జన్లు, గైనిక్ వైద్యులు ఈ ఆపరేషన్‌ను హోల్ ద్వారా నిర్వహించారు. ప్రభుత్వాసుపత్రిలో ఇది మొట్టమొదటి ఆపరేషన్‌గా వైద్యులు తెలిపారు. సింగరేణి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ ఏర్పడిన తరువాత జనరల్ ఆసుపత్రిలో అరుదైన ఆపరేషన్లతో పాటు క్రిటికల్ ఆపరేషన్లు నిర్వహించారు. ఇటీవల కాలంలో దవడ పండ్ల అమరిక, మోకాలు కీలు మార్పిడి, ముక్కుకు సంబంధిం చి సర్జరీలు చేస్తున్నారు. బాలుడికి ల్యాప్రోస్కోపి ద్వారా ఆపరే షన్ నిర్వహించిన వైద్యులను మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ హిమబిందు అభినందించారు.

ముత్తారంలో మిర్చి చిల్లింగ్ యూనిట్ ఏర్పాటుకు కృషి

● సమీక్ష సమావేశంలో కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ముత్తారంలో పైలట్ ప్రాజెక్టు కింద మహిళా సంఘాలతో మిర్చి చిల్లింగ్ యూనిట్ ఏర్పాటుకు కృషి చేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. ముత్తారంలో మిర్చి చిల్లింగ్ యూనిట్ ఏర్పాటుపై కలెక్టరేట్‌లో ఎన్ఐఎఫ్‌టీఎం ప్రతినిధులతో బుధవారం అదనపు కలెక్టర్ జే.అరుణ శ్రీతో కలిసి కలెక్టర్ కోయ శ్రీహర్ష సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫుడ్ టెక్నాలజీ మేనేజ్‌మెంట్ (ఎన్ఐఎఫ్‌టీఎం) సహకారంతో ముత్తారంలో మహిళా సంఘాల ద్వారా 40లక్షల పెట్టుబడితో మిర్చి పౌడర్, సాస్ తయారీ యూనిట్ ఏర్పాటుచేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. మిర్చి చిల్లింగ్ యూనిట్ ఏర్పాటుకు 20 లక్షల రూపాయలు ఎన్ఐఎఫ్‌టీఎం సంస్థ నుంచి అందజేస్తారని, మరో 20 లక్షల రూపాయలు మహిళా సంఘాల ద్వారా బ్యాంకు లింకేజీతో యూనిట్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సంబంధిత అధికారులకు సూచించారు. ముత్తారం, అడవిశ్రీరాంపూర్, ఓడెడు, సీతంపేట గ్రామాల్లో 750 మంది స్వశక్తి మహిళా సంఘాల సభ్యులను గుర్తించి, వారిని వరి నుంచి మిర్చిపంట సాగు దిశగా ప్రోత్సహించాలని తెలిపారు. మిర్చి యూనిట్ ఏర్పాటు ద్వారా రైతులు లాభసాటి పంటల దిశగా దృష్టి సారించేలా చర్యలు చేపట్టాలన్నారు. మిర్చి పంట పండించడం వల్ల రైతులకు అధిక ఆదాయం లభించే అవకాశం ఉందని, రైతులు పండించే పంటకు మంచి మార్కెట్ సౌకర్యం ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు. నిర్దిష్టమైన మిర్చి రకం పంట సాగు వల్ల రైతులకు అధిక లాభం చేకూరుతుందని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి రవీందర్, జిల్లా వ్యవసాయ అధికారి ఆదిరెడ్డి, లీడ్ బ్యాంకు మేనేజర్ వెంకటేష్, జిల్లా ఉద్యానవన శాఖా అధికారి జగన్‌మోహన్ రెడ్డి, నాబార్డ్ ఏజీఎం జయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ ఉద్యోగికి సన్మానం

కాల్వశ్రీరాంపూర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీలో పంపు ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్న మెట్టు లక్ష్మణ్ ఉత్తమ గ్రామపంచాయతీ ఉద్యోగిగా గుర్తించి ఎంపీవో గోవర్ధన్ గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గ్రామకార్యదర్శి సత్యనారాయణరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

బడ్జెట్‌లో నిధులు కేటాయించడం లేదు..

- 30న హైదరాబాద్‌లో ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా సమావేశం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణ స్వరూప్

కళ్యాణ్‌నగర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ, ఎస్టీలకు ప్రభుత్వం బడ్జెట్‌లో నిధులు కేటాయించడం లేదని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు వట్లమూరి కృష్ణ స్వరూప్ అన్నారు. బుధవారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ నిధులను గత ప్రభుత్వం, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం దారి మళ్లిస్తున్నాయన్నారు. ఇందిరమ్మ రాజ్యం అని గొప్పలు చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటి వరకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ఒక్క రూపాయి కూడా నిధులు మళ్లించలేదని, లోన్లు మంజూరుచేయక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎస్సీ, ఎస్టీ ఉప కమిషన్‌ను ఎందుకు ఏర్పాటు చేయలేదని ఆయన ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ప్రతి ఏడాది ఎస్సీ, ఎస్టీలకు రూ. 12500 కోట్లు కేటాయించాల్సి ఉండగా 2004 నుంచి ఇప్పటి వరకు నిధులు రాలేదని, ఆ నిధులు ఎటు వెళ్లాయని ఆయన ప్రశ్నించారు. సింగరేణిని కూడా కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం కలిసి అంబానీ, అదానీలకు కట్టబెట్టడానికి కుట్రలు చేస్తున్నాయని, భవిష్యత్‌లో సింగరేణి కనుమరుగయ్యే ప్రమాదం ఉందని, సంస్థలపై ప్రత్యక్ష, పరోక్షంగా ఆధారపడిన 5లక్షల మంది రోడ్డున పడుతారన్నారు. అంబాని, అదానీలకు అప్పగిస్తే భవిష్యత్‌లో కార్మికులు ప్రశ్నించే స్థాయిని కూడా కోల్పోతారన్నారు. ఈనెల 30న హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఎస్సీ వర్గీకరణ, క్రిమిలేయర్‌కు వ్యతిరేకంగా జరిగే సదస్సును విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు నీరటి శంకర్, రాంచందర్, ఈశ్వర్, జలపతి, రాజ్‌కుమార్, రాజేష్ పాల్గొన్నారు.

చెరువులో పడి పశువుల కాపరి మృతి

గొల్లపల్లి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన తూడి రాజయ్య (50) అనే వ్యక్తి ప్రమాదవశాత్తు చెరువులో పడి బుధవారం మృతి చెందాడు. ఎస్సై చిర్ర సతీష్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు.. రాజయ్య గ్రామంలో గేదెలను కాస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ నెల 25న చేపలు పట్టేందుకు వెళ్తున్నానని చెప్పి బయటికి వెళ్లి మళ్లీ రాలేదు. కుటుంబసభ్యులు భయాందోళన చెంది అతడి కోసం గ్రామంలో గాలించారు. చుట్టు పక్కల గ్రామాల్లో, బంధువుల ఇళ్లలో వెతికినా అతడి ఆచూకీ లభించలేదు. చివరికి పక్కనే ఉన్న రంగదాముని పల్లె చెరువులో నుంచి పోతున్న ఎస్సారెస్పీ 83/ఏ ఉప కాలువలో అతడి మృతదేహం కొట్టుకువచ్చింది. గమనించిన స్థానికులు రాజయ్య మృతదేహం గా గుర్తించి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. చేపలు పట్టేందు కు తెప్పపై వెళ్లి ప్రమాదవశాత్తు జారిపడి మృతి చెంది ఉండవచ్చని ఎస్సై తెలిపారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

మురికి కాలువలో పడి వ్యక్తి..

శంకరపట్నం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం కేశవపట్నం గ్రామంలో ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు మురికి కాలువలో పడి మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ఊకంటి పరబ్రహ్మం (55) అనే వ్యక్తి కేశవపట్నం గ్రామపంచాయతీ సమీపంలోని మురికికాలువలో పడి బుధవారం తెల్లవారు జామున మృతి చెందాడు. ఇతనికి ఇల్లు, భార్య పిల్లలు లేరు. గ్రామపంచాయతీ ఆవరణలోనే ఉండేవాడు. పలువురు, బంధువులు పరబ్రహ్మం అంత్యక్రియలు నిర్వహించారు.

చికిత్స పొందుతూ యువకుడు..

వీర్నపల్లి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు చికిత్సపొందుతూ మృతి చెందాడు. వీర్నపల్లి మండలంలోని గర్జనపల్లికి చెందిన ఈసంపల్లి ఆశిష్ (19) గత నెల ఒకటో తేదీన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. వెంటనే చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రికి తరలించారు. సుమారు రెండు నెలలు ఆస్పత్రిలోనే చికిత్స పొందాడు. బుధవారం పరిస్థితి విషమించి మృతి చెందాడు. ఒక్కగానొక్క కుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని బీఎస్పీ మండల అధ్యక్షుడు గజ్జెల ప్రశాంత్ కోరారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

కోనరావుపేట నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కోనరావుపేట మండలం మరిమడ్ల గ్రామంలోని అహ్మద్ హుస్సేన్‌పల్లికి చెందిన యువకుడు రోడ్డు ప్రమాదంలో అక్కడికక్కడే మృతి చెందాడు. గ్రామస్థుల వివరాల ప్రకారం అహ్మద్ హుస్సేన్‌పల్లికి చెందిన గజ్జల అజయ్‌కుమార్ (28) ద్విచక్రవాహనంపై మరిమడ్ల నుంచి తాటిపెల్లికి వెళ్తున్నాడు. రోడ్డుపక్కన ఉన్న ట్రాక్టర్ ట్రాలీ కల్టివేటర్ ఢీకొట్టాడు. దీంతో కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఉపాధినిమిత్తం దుబాయ్‌లో ఉంటున్న అజయ్‌కుమార్ ఇటీవల స్వగ్రామానికి వచ్చాడు. మరో 20 రోజుల తర్వాత దుబాయ్‌కి వెళ్లాల్సి ఉంది.




కొత్త కొత్తగా..

- కళాభారతిలో నూతన హంగులు
- త్వరలో అందుబాటులోకి రానున్న వేదిక

కరీంనగర్ కల్చరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): నాలుగు దశాబ్దాలకు పైగా చరిత్రకు, కళాకారులకు, కళలకు వారధి.. సంగీత, సాంస్కృతిక సాహిత్య కళా రాజకీయ వేదికలకు పెన్నిధి... కరీంనగర్ కళాభారతి. కరీంనగర్ కళా కిరీటంలో కలికితురాయిగా నిలిచి ఎందరో మహనీయులుగా అంతర్జాతీయ వేదికలకు పరిచయం చేసిన జిల్లా కేంద్రంలోని 'కళాభారతి' కొంత కాలంగా కళ తప్పింది. అధికారులు ఇటీవల నిధులు మంజూరు చేయడంతో నూతన హంగులతో ప్రజల ముందుకు వచ్చేందుకు ముస్తాబవుతోంది.

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని సృజనకారులు, కళాకారులు, నాయకులు, అధికారులు, ప్రజలు, సమావేశ కర్తలను వేదికగా నిలిచిన కళాభారతి కొద్ది కాలంగా నిర్లక్ష్యానికి గురవుతోంది. నేడు ఊడిన పైకప్పు పెచ్చులు... మరో వైపు విరిగిన కుర్చీలు.. ఇంకో వైపు కుంగిన వేదిక.. వెక్కిరిస్తున్న వసతులు... ఇలా శిథిలమై కనిపిస్తుంటే కళాకారుల గుండె తరుక్కుపోయేది. చెత్తా చెదారంతో అక్కరకురాని వస్తువులకు నిలయంగా ఉండేది. ప్రస్తుతం కళాభారతి రూపురేఖలు మారుతున్నాయి. గతవైభవం సంతరించుకునేలా కళాకారులు, సాహిత్యకారులు, కళాభిమానుల కోసం అధునాతన ఏర్పాట్లు చేస్తున్నారు. ఇటీవల జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకొని కళాభారతిని సందర్శించి రూ. 11 లక్షలతో స్టేజ్ వాల్, సౌండ్ ప్రూఫ్ ఎకోస్టిక్, రూఫ్ షీట్స్, డ్రెస్సింగ్‌రూంలు, తెరలు, సీలింగ్, కుర్చీల మరమ్మతులు, ఎలక్ట్రికల్ వర్క్స్, మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టాలని, కళాభారతికి మరోద్వారంతో పాటు మినీ పార్క్ పనులు వేగవంతంగా పూర్తిచేయాలని అధికారులకు సూచించారు. మేయర్ సునీల్‌రావు కూడా ఆధునీకరణ పనులను పరిశీలించి అధికారులకు తగు సూచనలిచ్చారు. పునర్నిర్మాణ పనులు ఆలస్యం అయి



నా ఆ తర్వాత పనులు వేగవంతం కావటంతో నూతన హంగులతో కళాభారతి త్వరలోనే మన ముందుకు రాబోతున్నది.

ఏదిఏమైనా కళాభారతి పునఃప్రారంభోత్సవంపై కళాకారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వివిధ కళా ప్రదర్శనలకు కళాసంస్థలు, కళాకారులు సిద్ధమవుతున్నారు. ఓ అధునాతన నూతన జనరేటర్ సమకూర్చితే బాగుంటుం దని, ఒక్కోసారి కరెంట్ పోవడంతో ప్రదర్శనకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుందని కళాకారులు పేర్కొంటున్నారు.

- ఉమ్మడి తెలుగు రాష్ట్రాలకు చెందిన ఘంటసాల నుంచి గద్దర్ వరకూ, కాంతారావు నుంచి నేటి నటీనటుల వరకు, ఎంఎస్ సుబ్బలక్ష్మి నుంచి నేటి కళాకారుల వరకు శ్రీశ్రీ, విశ్వనాథ, సినారె నుంచి ఈనాటి కవుల వరకు, గల్లీ లీడర్ నుంచి ఢిల్లీ లీడర్ వరకు అందరూ కళాభారతి వేదికనెక్కిన వారే.

ఇదీ మన కళాభారతి చరిత్ర

1974లో మున్సిపల్ ఛైర్మన్ నరహరి లక్ష్మన్ ఉన్న కాలంలో స్వతహాగా నటుడైన కళా పోషకుడు కమిషనర్ గౌస్‌మొహినోద్దీన్ కళాభారతిని ప్రారంభించారు. సుమారు 8 గుంటల స్థలంలో ఉన్న దీన్ని ఆ కాలంలో టౌన్ హాల్‌గా పిలిచే వారు. 1978లో కలెక్టర్‌గా ఉన్న కెఎస్ శర్మ దీన్ని కళాభారతిగా నామకరణం చేశారు. నాటి కాలంలో ఈ కళాభారతి కార్యక్రమాలకు సరిపడదని భావించి ప్రస్తుత కళాభారతి వెనుక భాగంలో బహిరంగ కళావేదిక ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి కళాభారతి మున్సిపల్ ప్రాపర్టీ కింద పడిపోయింది.

రూ.6,950 పలికిన పత్తి ధర

జమ్మికుంట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్‌లో క్వింటాల్ పత్తి ధర 6,950 రూపాయలు పలికింది. బుధవారం మార్కెట్ యార్డుకు 21మంది రైతులు 183 క్వింటాళ్ల విడి పత్తి, ఏడుగురు రైతులు 13 క్వింటాళ్ల గోనే సంచుల్లో విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర 6,950 రూపాయలు, కనిష్ఠ ధర ఆరు వేల రూపాయలు చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు. కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) మద్దతు ధర ప్రకారం 3,500 క్వింటాళ్ల పత్తి కొనుగోళ్లు చేపట్టింది.

రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు గ్రౌండ్ పరిశీలన

హుజూరాబాద్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలోని హైస్కూల్ గ్రౌండ్‌లో ఈ నెల 29నుంచి జరిగే అండర్-14 ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి హాకీ పోటీలు జరిగే స్థలాన్ని క్రీడాకారులు, ఫిజికల్ డైరెక్టర్లు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మున్సిపల్ అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో జిల్లా హాకీ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు బి శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, పీఈటీలు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

తిమ్మాపూర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎస్‌బీఐ-గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో డిసెంబరు 9వ తేది నుండి ఫోటోగ్రాఫీ అండ్ వీడియోగ్రఫి (పురుషులు) 30 రోజుల ఉచితశిక్షణ ప్రారంభం కానున్నట్లు సంస్థ డైరెక్టర్ డి సంపత్ ఒక ప్రకటనలో తెలిపారు. 18 నుంచి 45 సంవత్సరాల లోపు ఉన్న ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన గ్రామీణ ప్రాంతం వారు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులని తెలిపారు. వివరాలకు 9849411002, 7981151653 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

పంచాయతీ కార్యదర్శిని గాయపరిచిన వ్యక్తికి ఏడాది జైలు

మల్లాపూర్, నవంబరు, 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముత్యంపేట పంచాయతీ కార్యదర్శిని గాయపరిచిన కేసులో నిందిడుడికి సంవత్సరం జైలు శిక్షతో పాటు రూ. 200 జరిమానా విధిస్తూ మెట్‌పల్లి న్యాయస్థానం బుధవారం తీర్పినిచ్చినట్లు మల్లాపూర్ ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు. 2019లో ముత్యంపేటలో కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న ఎండీ జమీల్‌ను ఖాజాఖాన్ అనే వ్యక్తి దాడిచేసి గాయపరిచాడు. విచారణ చేపట్టిన అప్పటి ఎస్సై రవీందర్ కేసు నమోదు చేశాడు. ఖాజాఖాన్‌పై నేరం రుజువు కావడంతో ఏడాది జైలు శిక్షతో పాటు 200 రూపాయలు జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు.

వృద్ధురాలిని కాపాడిన పోలీసులు

ధర్మపురి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాయపట్నం గోదావరి బ్రిడ్జి పైనుంచి దూకి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించిన సాయిని మల్లేశ్వరీ అనే వృద్ధురాలిని బుధవారం పోలీసులు కాపాడారు. మంచిర్యాల జిల్లా దండెపల్లి మండలంలోని ద్వారక గ్రామానికి చెందిన మల్లేశ్వరీ అనే వృద్ధురాలు ఇంట్లో గొడవపడి ఆత్మహత్య చేసుకుందామని రాయపట్నం గోదావరి బ్రిడ్జి వద్దకు వచ్చింది. బ్రిడ్జిపై నుంచి నదిలో దూకేందుకు ప్రయత్నం చేస్తుండగా అక్కడే చెక్‌పోస్టు వద్ద ఉన్న పోలీసులు గమనించారు. వెంటనే ఆమె ప్రాణాలు కాపాడి శెకెల్ల గ్రామంలో ఉన్న ఆమె కూతురు కొత్త లలితకు సమాచారం అందించారు. వృద్ధురాలికి కౌన్సెలింగ్ ఇచ్చి ఎస్ఐ ఉదయ్‌కుమార్ ఆమె కూతురు లలితకు అప్పగించారు.

సీఈఐఆర్ ద్వారా 162 మొబైల్ ఫోన్ల రికవరీ

- సీసీఎస్ ఏసీపీ కాశయ్య



బాధితులకు మొబైల్‌ఫోన్లను అందజేస్తున్న సీసీఎస్ ఏసీపీ కాశయ్య

కరీంనగర్ క్రైం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): సెంట్రల్ ఈక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్(సీఈఐఆర్) పోర్టల్ విధానం ఉపయోగించి కమిషనరేట్ వ్యాప్తంగా కొద్ది నెలల క్రితం పోగొట్టుకున్న 162 మొబైల్ ఫోన్లను గుర్తించిన సైబర్ క్రైం, సీసీఎస్ పోలీసులు బాధితులకు అప్పగించారు. బుధవారం పోలీస్ కమిషనరేట్ కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బాధితులకు మొబైల్ ఫోన్లను అందించారు. అనంతరం విలేకరులకు సీసీఎస్ ఏసీపీ పి కాశయ్య వివరాలను వెల్లడించారు. 2023 ఏప్రిల్‌లో సీఈఐఆర్ విధానాన్ని ఉపయోగిస్తున్నామని, అప్పటి నుంచి ఇప్పటి వరకు పలు బాధితులకు 1206 మొబైల్‌ఫోన్లను గుర్తించి అందజేశా మన్నారు. సీఈఐఆర్ ఆధునిక సాంకేతిక వినియోగం ద్వారా పోగొట్టుకున్న మొబైల్‌ఫోన్‌లను గుర్తించడం సులభం అవుతుందని తెలిపారు. మొబైల్‌ఫోన్లు పోగొట్టుకున్న బాధి తులు వెంటనే సీఈఐఆర్ పోర్టల్ లేదా సంబంధిత పోలీసు ఠాణాలో ఫిర్యాద చేయాలన్నారు. ఇదివరకే ఇతరులు ఉపయోగించిన ఫోన్లను కొనుగోలు చేసేవారు ఆ ఫోన్‌ల ఐఎంఈఐ వివరాలను సీఈఐఆర్ పోర్టల్‌లో నమోదు చేసి చెక్ చేసుకుంటే ఆ ఫోన్ స్టేటస్ తెలుస్తుందని ఏసీపీ కాశయ్య ప్రజలకు సూచించారు. ఏ కంపెనీకి చెందిన మొబైల్ ఫోన్ అయినా సీఈఐఆర్ విధానంతో ఆ ఫోన్ ఎవరి వద్ద ఉన్నా పనిచేయకుండా చేయవచ్చన్నారు. ఈ సేవలను ప్రజలు ఉపయోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీసీఎస్ సీఐ రమేష్ పాల్గొన్నారు.

హుజూరాబాద్ (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ డివిజన్ పరిధిలో పోగొట్టుకున్న 50 సెల్‌ఫోన్లను సాంకేతిక పరిజ్ఞానంతో కనిపెట్టి బాధితులకు బుధవారం ఏసీపీ శ్రీనివాస్‌జీ అందజేశారు. ఈ సందర్భంగా ఏసీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇటీవల చాలా మంది ఫోన్లు పొగొట్టుకోగా సీఈఐఆర్ పోర్టల్ ద్వారా తమ సిబ్బంది ఆచూకీ కనుకొన్నారన్నారు. అనంతరం 50 మంది బాధితులకు సెల్‌ఫోన్లను అందించారు. తమ సెల్‌ఫోన్లు అందించినందుకు బాధితులు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సీఐలు తిరుమల్‌గౌడ్, పులి వెంకట్‌గౌడ్, రవి, కిశోర్, ఎస్ఐలు తిరుపతి, రాజకుమార్ పాల్గొన్నారు.

రామడుగు (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన గంటే మునిందర్, పందికుంట గ్రామానికి చెందిన బండ్ల రాంచరణ్ ఇటీవల తమ మొబైల్ ఫోన్‌లను పొగొట్టుకొని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్ఐ శేఖర్ సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫోన్‌లను రికవరీ చేయించి బుధవారం బాధితులకు అందజేశారు. ఫోన్‌ల రికవరీలో కీలకపాత్ర పోషించిన హెడ్ కానిస్టేబుల్ భూమయ్యను ఎస్ఐ ప్రత్యేకంగా అభినందించారు.

తప్పుడు పత్రాలతో స్థలం రిజిస్ట్రేషన్, అమ్మకం

- నిందితుడిని అరెస్టు చేసిన రూరల్ సీఐ


నిందితుడు పుట్టపాక శ్రీనివాస్

కరీంనగర్ క్రైం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): చనిపోయిన మహిళ పేరిట ఉన్న స్థలాన్ని తప్పుడు పత్రాలతో రిజిస్ట్రేషన్ చేసుకుని మరొకరికి విక్రయించిన కేసులో నిందితుడిని కరీంనగర్ రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. కరీంనగర్ రూరల్ సీఐ ప్రదీప్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ రూరల్ మండలం బొమ్మకల్ గ్రామానికి చెందిన సామిండ్ల పద్మప్రియ అనే మహిళ 2008లో మరణించింది. ఆమె పేరిట గ్రామంలో ఆరు గుంటల స్థలం ఉంది. ఆమె కుటుంబసభ్యులకు తెలియకుండా 2013లో కరీంనగర్ మారుతినగర్‌కు చెందిన పుట్టపాక శ్రీనివాస్ అనే వ్యక్తి తనపేరిట తప్పుడు పత్రాలతో రిజిస్ట్రేషన్ చేసుకున్నాడు. వేరొక మహిళ పేరిట తప్పుడు గుర్తింపుకార్డును తయారుచేసి ఆమెను పద్మప్రియగా చూపించి అక్రమంగా స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేసుకున్నాడు. ఆ తరువాత ఆ స్థలాన్ని మరికొంద రికి విక్రయించాడు. స్థల యజమాని కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లో ఉండటంతో వారికి ఈ విషయం తెలియలేదు. ఆలస్యంగా తెలుసుకున్న బాధితులు పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు విచారణ చేసిన కరీంనగర్ రూరల్ సీఐ ప్రదీప్‌కుమార్ నిందితుడైన పుట్టపాక శ్రీనివాస్‌ను గుర్తించి బుధవారం అరెస్టు చేశారు. కోర్టు ఆదేశాల మేరకు 14 రోజుల రిమాండ్‌కు కరీంనగర్ జిల్లా జైలుకు తరలించారు. కాగా నిందితుడు పుట్టపాక శ్రీనివాస్‌పై కరీంనగర్‌లోని మూడు పట్టణ పోలీసు ఠాణాలతో పాటు కరీంనగర్ రూరల్ ఠాణాలో కూడా పలు చీటింగ్ కేసులు నమోదయ్యాయని సీఐ తెలిపారు.

హార్వెస్టర్‌లో మంటలు.. తప్పిన పెను ప్రమాదం

హుజూరాబాద్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణం వరంగల్ రోడ్‌లోని ఓ మెకానిక్ షాప్‌లో పెను ప్రమాదం తప్పింది. చిన్నపాపయ్యపల్లి గ్రామానికి చెందిన కోమల్‌రెడ్డి హార్వెస్టర్ రిపేరు చేస్తుండగా ప్రమాదవశాత్తు మంటలంటుకున్నాయి. గమనించిన స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. వెంటనే అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని మంటలను ఆర్పేశారు.

ఆలయంలో పంచలోహ విగ్రహాల చోరీ

కరీంనగర్ క్రైం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ కోతిరాంపూర్‌లోని హనుమాన్ దేవాలయంలో మంగళవారం అర్ధరాత్రి దొంగతనం జరిగింది. దేవాలయంలోని సీత, రాముడు, లక్ష్మణుడు, ఆంజనేయుడి ఉత్సవ పంచలోహ విగ్రహాలను గుర్తుతెలియని దొంగలు ఎత్తుకుపోయారు. ఉత్సవ విగ్రహాలతో పాటు ఆలయంలోని వెండి దీపాలు, శఠగోపం, కిరీటంను కూడా దొంగలు ఎత్తుకుపోయారు. ఈ మేరకు ఆలయ పూజారి రామరాజేశ్వరశర్మ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పూజారి మంగళవారం పూజల అనంతరం మధ్యాహ్నం 12 గంటలకు గుడికి తాళం వేసి ఇంటికి వెళ్లాడు. బుధవారం ఉదయం 5:30 గంటలకు గుడికి వచ్చేసరికి తాళాలు పగులగొట్టి ఉన్నాయి. ఆలయం లోపలికి వెళ్ళి చూడగా నాలుగు పంచలోహ ఉత్సవ విగ్రహాలు, వెండి వస్తువులు కనపడలేదు. వెంటనే పోలీసులకు సమాచారం అందించాడు. పంచలోహ విగ్రహాల విలువ 55 వేలుంటుందని, వెండి పూజా వస్తువుల విలువ 15వేల వరకు ఉంటుందని ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఉత్సవవిగ్రహాలు ఎత్తుకుపోయింది దొంగలేనని కరీంనగర్ ఒకటో ఠాణా సీఐ బిల్ల కోటేశ్వర్ తెలిపారు. మహాలక్ష్మినగర్‌లోని వెంకటేశ్వర దేవాలయంలో మూడురోజుల కిందట కలశాలు, సామాగ్రిని దొంగలు ఎత్తుకుపోయారని దేవాలయనిర్మాత అశోక్‌రావు తెలిపారు.



ఆలయం వద్ద విచారణ జరుపుతున్న పోలీసులు

యువకుడి మృతదేహం లభ్యం

గంభీరావుపేట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) గంభీరావుపేట మండలం నర్మాల ఎగువ మానేరు జలాశయంలో మంగళవారం దూకిన కామారెడ్డి జిల్లా మాచారెడ్డి ఎల్పుగొండకు చెందిన భరత్‌కుమార్ (31) మృత దేహం బుధవారం లభ్యమైంది. గంభీరావుపేట ఎస్సై శ్రీకాంత్ వివరాల ప్రకారం.. మృతుడు భరత్ కుమార్‌కు 11 నెలల కిందట వివాహమైంది. కొద్ది రోజులుగా భరత్ అనారోగ్య సమస్యతో బాధపడుతున్నాడు. దీనికి తోడు అప్పుల ఒత్తిళ్ల అధికమయ్యాయి. దీంతో మానసికంగా కుంగిపోయాడు. బాధలు భరించలేకనే మంగళవారం నర్మాల ఎగువ మానేరు జలాశయంలో దూకాడు. గజ ఈతగాళ్ల సహాయంతో భరత్ మృతదేహన్ని మానేరు నుంచి బుధవారం బయటకు తీశారు. భరత్‌కుమార్ తల్లి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఎన్టీపీసీ అన్నపూర్ణకాలనీలో చోరీ

- 2.5 తులాల నగలు, రూ.50 వేలు అపహరణ


బీరువాను పరిశీలిస్తున్న సీసీఎస్

జ్యోతినగర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఎన్టీపీసీ అన్నపూర్ణకాలనీలో మంగళవారం చోరీ జరిగింది. ఇంట్లో ఉన్న రెండున్నర తులాల బంగారు ఆభరణాలు, 50 వేల రూపాయల నగదును గుర్తు తెలియని దొంగలు ఎత్తుకెళ్లారు. బైరి సుస్మిత అనే మహిళ తన 10 ఏళ్ల కూతురుతో అన్నపూర్ణకాలనీలో అద్దె ఇంట్లో ఉంటున్నది. మూడేళ్ల క్రితం ఆమె భర్త చనిపోగా, కూతురుతో కలిసి ఉంటోంది. సుస్మిత ఎఫ్‌సీఐ క్రాస్ రోడ్డులోని ఓ మాల్‌లో పనిచేస్తోంది. మంగళవారం తన కూతుర్ని స్కూల్‌కు పంపి మాల్‌కు వెళ్లింది. సాయంత్రం తన కుమార్తె ఇంటికి వస్తుందనే ఉద్దేశంతో ఇంటి తాళంచెవి కిటికీపై పెట్టింది. ఈక్రమంలో దొంగలు తాళంచెవితో ఇంట్లోకి ప్రవేశించి బీరువాను తెరిచి అందులో ఉన్న రెండున్నర తులాల బంగారు నగలు, 50 వేల రూపాయలను అపహరించారు. బాధితురాలు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. చోరీ జరిగిన ఇంటిని ఎన్టీపీసీ పోలీసులు, సీసీఎస్ పోలీసులు పరిశీలించారు. క్లూస్ టీం ఆధారాలు సేకరించింది. ఎన్టీపీసీ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పశుగ్రాసం దగ్ధం

మానకొండూర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగిపల్లి గ్రామంలో పశుగ్రాసంతో వెల్తుతున్న ట్రాక్టర్‌కు ప్రమాదవశాత్తు విద్యుత్ వైర్లు తాకి పశుగ్రాసం పూర్తిగా దగ్ధం అయింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. శంకరపట్నం మండలంలోని ఎరడపల్లి గ్రామానికి చెందిన జింక రాజయ్య అనే వ్యక్తి బుధవారం తన ట్రాక్టర్‌లో కరీంనగర్ మండలంలోని చింతకుంట గ్రామానికి పశుగ్రాసాన్ని తరలిస్తున్నాడు. మండలంలోని గంగిపల్లి గ్రామంలోని బస్టాండ్ వద్దకు రాగానే ట్రాక్టర్‌లోని పశుగ్రాసానికి విద్యుత్ వైర్లు తాకి మంటలు లేవగా డ్రైవర్ ట్రాక్టర్‌ను నిలిపివేశాడు. గ్రామస్థుల సహాయంతో ట్రాక్టర్‌లోని గడ్డి కట్టలను కర్రల సహాయంతో కిందికి తీసివేయడంతో ప్రమాదం తప్పింది. సమాచారం తెలుసుకున్న స్థానిక అగ్నిమాపక వాహనం సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను ఆర్పివేశారు.


సిరిసిల్ల శివవనగర్ పాఠశాలలో విద్యార్థులకు అటల్ టింకరింగ్ శిక్షణ

బాలలు.. భావి శాస్త్రవేత్తలు

- ఆలోచింపజేస్తున్న విద్యార్థుల ఆవిష్కరణలు
- ఇన్‌స్పైర్ మనక్‌తో ప్రోత్సాహం
- అటల్ టింకరింగ్‌లో ల్యాబ్‌లో శిక్షణ

సిరిసిల్ల రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పాఠశాలస్థాయి నుంచే విద్యార్థులకు శాస్త్రసాంకేతిక రంగాలపై ఆసక్తి కలిగించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శ్రీకారం చుట్టాయి. ఆవిష్కరణలతో విద్యార్థుల నైపుణ్యాన్ని పెంపొందిస్తూ శాస్త్ర వేత్తలుగా ఎదిగేందుకు ప్రోత్సహిస్తున్నాయి. సిరిసిల్ల పట్టణంలోని శివనగర్ కుసుమ రామయ్య బాలుర జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు ఇన్‌స్పైర్ మానక్‌లో నూతన ఆవిష్కరణలకు జీవం పోస్తున్నారు. నాలుగేళ్ల క్రితం పాఠశాలలో అటల్ టింకరింగ్ ల్యాబ్ ఏర్పాటు చేశారు. సైన్స్ ఉపాధ్యాయుడు పాకాల శంకర్‌గౌడ్ అటల్ టింకరింగ్‌లో విద్యార్థులకు శిక్షణను అందిస్తూ నూతన ఆవిష్కరణలను తయారు చేయిస్తున్నారు. పాఠశాలలో పదోతరగతి చదువుతున్న జక్కని హేమంత్ తయారు చేసిన పవర్‌లూం క్లాత్‌ఫోల్డింగ్ మిషన్ 2022-23 సంవత్సరానికి ఇన్‌స్పైర్ మానక్ జాతీయ స్థాయి ప్రదర్శనకు ఎంపికైంది. పదోతరగతి చదువుతున్న మరో విద్యార్థి సీహెచ్ శివతేజ డాగ్ సేఫ్టీ డివైస్‌ను తయారు చేశాడు. విద్యార్థిని కుమ్మరికుంట నిహారిక మేకింగ్ గణేష్ ఐడియల్ విత్ ఏకో ఫ్రెండ్లీ పరికరాన్ని ఆవిష్కరించింది.


ఫోల్డింగ్ యంత్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ (ఫైల్)

క్లాత్ ఫోల్డింగ్ యంత్రం తయారు చేశా

జక్కని హేమంత్ విద్యార్థి



పవర్‌లూం క్లాత్‌ఫోల్డింగ్ యంత్రాన్ని తయారు చేశాను. జాతీయ స్థాయికి ఎంపికైంది. మరింతగా ప్రోత్సహిస్తే మరిన్ని పరికరాలను తయారు చేస్తాను.

పరికరాలను తయారీ నేర్చుకున్నా

నిహారిక, 10వ తరగతి, సిరిసిల్ల



పాఠశాలలో అటల్ టింకరింగ్‌లో సైన్స్ పరికరాల తయారీపై శిక్షణ ఇచ్చారు. గతేడాది సైన్స్ ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో మేకింగ్ గణేష్ ఐడియల్ విత్ ఏకో ఫ్రెండ్లీ యంత్రాన్ని తయారు చేశా. మరిన్ని పరికరాలను తయారు చేస్తాను.

సైన్స్ ఉపాధ్యాయుల ప్రోత్సాహం

సీహెచ్ శివతేజ, 10వ తరగతి, సిరిసిల్ల



మా పాఠశాలలో సైన్స్ ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో సైన్స్ పరికరాల తయారీ నేర్చుకున్నాను. నేను డాగ్ సేఫ్టీ డివైస్‌ను తయారు చేశాను.

విద్యార్థుల సృజనాత్మకతను వెలికి తీస్తున్నాం

పాకాల శంకర్‌గౌడ్, సైన్స్ టీచర్, సిరిసిల్ల



ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు అటల్ టింకరింగ్ ల్యాబ్ సూపర్ ఫిఫ్టీ వర్క్‌షాప్‌ను నిర్వహిస్తున్నాం. విద్యార్థుల ఆవిష్కరణలను ప్రోత్సహిస్తున్నాం. స్పోకెన్ ఇంగ్లీష్ కూడా నేర్పిస్తున్నాం. విద్యార్థుల ప్రదర్శనలు రాష్ట్ర, జాతీయస్థాయికి ఎంపికవుతున్నాయి.

రాజన్న హుండీ ఆదాయం రూ.1.50 కోట్లు



రాజన్న ఆలయంలో హుండీ లెక్కింపులో ఉద్యోగులు, సిబ్బంది

వేములవాడ కల్చరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రాజరాజేశ్వరస్వామి దేవస్థానానికి హుండీ ద్వారా రూ.1.50 కోట్ల ఆదాయం లభించింది. బుధవారం ఆలయ ఓపెన్ స్లాబ్‌లో 32 రోజుల హుండీ ఆదాయాన్ని లెక్కించారు. ఆలయ ఖజానాకు ఒక కోటి 50 లక్షల 24 వేల 507 రూపాయలు సమకూరగా, 170 గ్రాముల బంగారం, 9 కిలోల 800 గ్రాముల వెండి లభించినట్లు ఆలయ ఈవో వినోద్ రెడ్డి తెలిపారు.

అంజన్న సన్నిధిలో ప్రముఖుల పూజలు



కొండగట్టులో జడ్జిని సత్కరిస్తున్న అధికారులు

మల్యాల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): జనగామ జిల్లా ప్రిన్సిపల్ జడ్జి డి రవీంధర్‌శర్మ కుటుంబ సమేతంగా కొండగట్టు ఆంజనేయస్వామిని బుధవారం దర్శించుకున్నారు. ఆలయంలో స్వామివారికి పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ పర్యవేక్షకులు గుండి హరిహరనాథ్ శాలువతో సత్కరించగా అర్చకులు స్వామి వారికి తీర్థ ప్రసాదాలు అందించి ఆశీర్వదించారు.

● బుల్లితెర నటుడు, యాంకర్ బత్తిరి సత్తి ఆలియాస్ రవికుమార్ కొండగట్టు అంజన్నను దర్శించుకున్నారు. స్వామి వారికి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఆయనతో సెల్ఫీలు దిగారు. భారతపు శ్రీనివాస్ ఆయన వెంట ఉన్నారు

ధర్మపురి (ఆంధ్రజ్యోతి): ధర్మపురి లక్ష్మీనరసింహస్వామి దేవాలయాన్ని ప్రముఖ కమేడియన్, టీవీ యాంకర్ బిత్తిరి సత్తి బుధవారం సందర్శించారు. స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ వేదపండితులు, అర్చకులు ఆయనను ఘనంగా ఆశీర్వదించారు. ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ స్వామి శేషవస్త్రం, ప్రసాదాలు, చిత్రపటం బహూకరించి సత్కరించారు.

ఉమ్మడి జిల్లా సాఫ్ట్‌బాల్ పోటీలు

భగత్‌నగర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండలం చింతకుంటలో ఉమ్మడి జిల్లా స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలు జరిగాయి. 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-17 బాలబాలికలకు ఉమ్మడి జిల్లా సాఫ్ట్‌బాల్ ఎంపిక పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శోభారాణి, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి వేణుగోపాల్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ కరీంనగర్ పేట టీఎస్ అధ్యక్షుడు అంతడుపుల శ్రీనివాస్, పెద్దపల్లి జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి కొమురోజు శ్రీనివాస్, కరీంనగర్ హ్యాండ్ బాల్ అసోసియేషన్ సెక్రెటరీ జి శ్రీను, ఎండి యూనిస్ పాషా, వ్యాయామ ఉపాధ్యాయుడు ఆడెపు శ్రీనివాస్, వీరన్న, శంకరయ్య, భక్తు రాజ్‌కుమార్, మహేష్, సంతోష్, రాజబాబు, రజనీ, సౌజన్య శ్రీధర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కళలకు నిలయాలు ఆ పల్లెలు

- కళ్లముందు కట్టిపడేస్తున్న రంగస్థలం కళాకారులు
- సినీ, నాటక రంగంలో రాణిస్తున్న గోదూర్, వేములకుర్తి గ్రామస్థులు
- రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో గుర్తింపు
- అటు రంగ స్థలంలోనూ... ఇటు వెండి తెరపైననూ...
- దాదాపుగా ఇంటికో కళాకారుడు... కళాభిమానులు



రంగస్థలంపై గోదూర్ కళాకారుల ప్రదర్శన

ఇబ్రహీంపట్నం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత ఆధునిక జీవితంలో బాలీవుడ్, టాలీవుడ్, హాలీవుడ్ సినిమాలతో పాటు ప్రపంచం నలు మూలల నుంచి ఎది చూడాలనుకున్నా అరచేతిలో ఫోన్‌లో చూసేస్తున్నాం. కానీ రెండు దశాబ్దాల క్రితం స్మార్ట్ ఫోన్ రాకముందు వినోదం కావాలంటే ఖసీర్ వద్దకు వెళ్లాల్సిందే. పల్లెటూరు నుంచి పట్నం వరకు ఆనాడు వీధి నాటకాలు, రంగస్థలాలో నాటికలు, పలు సాంస్కృతిక నృత్యాలు వేస్తే చాలు ప్రజలు గుమిగుడి ఎంజాయ్ చేశారు. అలాంటి కళలకు నిలయాలుగా ఆ పల్లెలు దినదినాభివృద్ధి చెందుతున్నాయి.... కళాకారులకు అడ్డాగా ఆ రెండు గ్రామాలు వర్ధిల్లుతున్నాయి.

ఇబ్రహీంపట్నం మండలం గోదూర్, వేములకుర్తి గ్రామాల్లో వర్ధిల్లుతున్న కళారంగంపై 'ఆంధ్రజ్యోతి' అందిస్తున్న ప్రత్యేక కథనం...

కళలకు పుట్టినిల్లుగా గోదూర్..

ఇబ్రహీంపట్నం మండలం గోదూర్‌లో దాదాపుగా కళాకారులు, కళాభిమానులున్నారు. దాదాపుగా వంద సంవత్సరాలుగా కళలకు పుట్టినిల్లుగా గోదూర్ గుర్తింపును సొంతం చేసుకుంది.

పలు సందర్భాల్లో పలు ప్రాంతాల్లో జరిగిన రాష్ట్ర స్థాయి జానపద ప్రదర్శనలు, నాటిక పోటీల్లో పాల్గొని శభాష్ అనిపించుకుంటున్నారు. నాటికలకు తోడు యక్ష గాణాలు, వీధి నాటికలు, హరికథలు, బుర్రకథలు, ఏకపాత్రాభినయాలు, జానపద నృత్యాలు ప్రదర్శిస్తూ ప్రశంసలు పొందుతున్నారు. గోదూర్‌లో ప్రస్తుతం దాదాపుగా సుమారు వంద మంది కళాకారు లున్నారు. గ్రామానికి చెందిన కోటగిరి మురళీ అలియాస్ గోదూర్ మురళీ సినీ రంగంలోనూ రాణిస్తూ మన్ననలు పొందుతున్నారు. కాయితి చంద్రశేఖర్, చల్ల దేవదాసు, కోటగిరి వెంకటస్వామి, రంగయ్య, చెట్ల శ్రీనివాస్ గౌడ్, లక్ష్మణ మూర్తి, దక్షిణ మూర్తి, తదితరులు రంగస్థల నటనలో రాష్ట్ర స్థాయిలో రాణిస్తున్నారు. గోదూర్ కళాకారులు నటించిన 'రుద్రవీణ', 'రాయి', 'చెల్లని పైసలు' నాటికలకు గతంలో రాష్ట్ర స్థాయి అవార్డులు వచ్చాయి.



చిత్రీకరణ జరుపుతున్న యూనిట్ సభ్యులు

వేములకుర్తిలో ఇంటింటికో కళాకారుడు..

మండలంలోని వేములకుర్తి గ్రామంలో దాదాపుగా ఇంటికో కళాకారుడున్నాడు. వేములకుర్తికి చెందిన పలువురు కళాకారులు వెండి తెరపైనా రాణిస్తున్నారు. గ్రామానికి చెందిన అంకతి భరత్ అను యువకుడు శ్రీ రాజన్న మూవీస్ పేరిట సొంత బ్యానర్ ఏర్పాటు చేసుకొని సినిమా నిర్మాణాలు జరుపుతున్నాడు. 'మృత్యువు', 'నేను బతికే ఉన్నాను', 'రక్షక్', 'ఇంటరాగేషన్', 'మహ కంత్రి గాళ్లు', 'వీళ్లకు అంత సీన్ లేదు', 'బాక్స్', 'మెంటల్ పోలీస్', 'పడిపోయా నీ మాయ'లో తదితర సినిమాల్లో వేములకుర్తికి చెందిన పలువురు కళాకారులు నటించారు. గ్రామానికి చెందిన రాదారపు ప్రభాకర్, మోహన్, సురేశ్, రమేశ్, కోటగిరి అశోక్, రాదారపు దేవదాసు రంగ స్థలం నటన, షార్ట్ ఫిలింస్‌లో పేరు తెచ్చుకున్నారు.



సినీ నిర్మాత దిల్‌రాజుతో వేములకుర్తి కళాకారులు

ప్రభుత్వం ప్రోత్సాహం అందించాలి

అంకతి భరత్, సినీ కళాకారుడు, వేములకుర్తి



గ్రామీణ ప్రాంతాల కళాకారులకు ప్రభుత్వం మరింత ప్రోత్సాహం అందించాలి. రోజురోజుకూ అంతరించి పోతున్న కళలను బతికించుకోవడానికి ప్రోత్సాహం అవసరం.

కళలకు అడ్డాలుగా గోదూర్, వేములకుర్తి

కోటగిరి చైతన్య, కళాకారుడు, గోదూర్



జిల్లాలో కళలు, కళాకారులు, కళాభిమానులకు అడ్డాలుగా ఇబ్రహీంపట్నం మండలం గోదూర్, వేములకుర్తి గ్రామాలు గుర్తింపు పొందాయి. ఉమ్మడి కరీంనగర్, ఆదిలా బాద్, నిజామాబాద్, వరంగల్, ఖమ్మం, మెదక్ తదితర జిల్లాల్లో పలు సందర్భాల్లో జరిగిన పోటీల్లో గోదూర్, వేములకుర్తి కళాకారులు రాణించి ప్రతిభను చాటుకున్నారు.

పాదయాత్రను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న విశారదన్‌మహరాజ్

సుభాష్‌నగర్, నవంబరు 27: ప్రజా సమస్యల పరిష్కారానికి చేపట్టనున్న మాభూమి పాదయాత్రను విజయవంతం చేయాలని ధర్మ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ విశారదన్‌మహరాజ్ కోరారు. బుధవారం నగరంలోని ఫిల్మ్‌భవన్‌లో ఉమ్మడి జిల్లా ముఖ్యకార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విశారదన్‌మహరాజ్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ వర్గాల ప్రజల సమస్యల పరిష్కారం కోసం 2025 జనవరి 5న పాదయాత్ర ఆదిలాబాద్‌లో ప్రారంభమవుతుందని తెలిపారు. ప్రజలకు విద్య, వైద్యం, ఉపాధి, గృహం, భూమి ఇవ్వాలని కోరుతూ పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా కలెక్టర్, తహసీల్దార్లకు వినతి పత్రాలు ఇచ్చామన్నారు. వారి నుంచి ఎలాంటి స్పందన రానందున రాష్ట్ర వ్యాప్తంగా ధర్నా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో తమ పార్టీ పోటీ చేస్తుందని ఆయన తెలిపారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి శ్రీకాంత్, జిల్లా అధ్యక్షుడు తాళ్ళ నరేష్, సిరిసిల్ల బాబు, జగిత్యాల శివ, పెద్దపల్లి గణేశ్, ఉపాధ్యక్షుడు రవీందర్, బాబు, రాజేంద్ర ప్రసాద్, రాకేశ్, పరమేశ్వరి పాల్గొన్నారు.

షూటింగ్‌బాల్ పోటీలకు ఉమ్మడి జిల్లా క్రీడాకారులు



పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): బిహార్ రాష్ట్రంలోని బుద్ధగయలో ఈ నెల 29, 30, డిసెంబర్ 1న జరిగే జాతీయస్థాయి షూటింగ్‌బాల్ పోటీలకు ఉమ్మడి జిల్లా క్రీడాకారులు ఎంపికయ్యారు. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి షూటింగ్‌బాల్ పోటీల్లో విశేష ప్రతిభచాటిన ఉమ్మడి జిల్లా క్రీడాకారులు పి శ్రీచరణ్ పటేల్, టి రణవీర్ రాజ్, పి సహన్, వి శ్రీహర్ష, వి యుక్త జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారని ఉమ్మడి జిల్లా షూటింగ్‌బాల్ అసోసియేషన్ ప్రధానకార్యదర్శి మహ్మద్ ముఫ్సాజిల్ తెలిపారు. క్రీడాకారులను జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నందెల్లి మహిపాల్, గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి అభినందించారు.

అరుణాచలం తరహాలో కొండగట్టు గిరిప్రదక్షిణ



గిరిప్రదిక్షణ మార్గం కోసం మట్టి తీస్తున్న ఎమ్మెల్యే సత్యం

● **ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం**

మల్యాల, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): తమిళనాడులోని అరుణాచలం వద్ద నిర్వహిస్తున్న తరహాలోనే కొండగట్టు ఆంజనేయస్వామి గుట్ట చుట్టూ గిరిప్రదక్షినకు ఏర్పాట్లు చేయనున్నట్లు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం తెలిపారు. కొండగట్టు గుట్ట చుట్టూ భక్తులు చేసే గిరిప్రదిక్షణ మార్గం అభివృద్ధి పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా పూజలు నిర్వహించి మట్టి తవ్వారు. గిరిప్రదిక్షణ మార్గంను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ కొండగట్టులో గిరిప్రదిక్షన కోసం రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ రెండు లక్షలు రూపాయలు సొంతంగా ఇచ్చారని అందులో భాగంగా పనులను చేపట్టినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో దేవస్థానం ఏఈవో అంజయ్య, మల్యాల, కొడిమ్యాల సింగిల్‌విండో చైర్మన్లు రాంలింగారెడ్డి, రాజనర్సింగరావు, నాయకులు ఆదిరెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, ముత్యం శంకర్, సతీశ్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, అనిల్, వినయ్, హరినాథ్, తిరుపతి నర్సింహరెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, ప్రతాప్, మల్లేశంపాల్గొన్నారు

ధర్మపురిలో కార్తీక భక్తుల సందడి

ధర్మపురి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో బుధవారం కార్తీక భక్తుల రద్దీ నెలకొంది. లక్ష్మీనృసింహ స్వామి, అనుబంధ రామలింగేశ్వ స్వామి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నరసింహుడి ఆలయంలో భక్తులు అభిషేకాది పూజలు, కుంకుమార్చన, స్వామివారల నిత్య కళ్యాణం జరిపించారు. స్వామివారలకు ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్‌శర్మ, వేద పారాయణదారు పాలెపు ప్రవీణ్‌కుమార్‌శర్మ నిత్య పూజలు చేశారు. స్థానిక శేషప్ప కళావేదికపై బ్రహ్మశ్రీ గరిపెల్లి మహేష్‌శర్మ కార్తీక పురాణ ప్రవచనాలు చేశారు.



గోదావరికి హారతి ఇస్తున్న అర్చకులు, భక్తులు

● కార్తీక మాసం పురస్కరించుకుని ధర్మపురి వద్ద గోదావరి హారతి 26వ రోజు బుధవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ఆలయ వేదపండితులు, అర్చకులు, సిబ్బంది, గోదావరి నది వరకు శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం ఆలయ వేదపండితులు మంత్రోచ్ఛరణల మధ్య నదీ మాతకు హారతి ఇచ్చారు. ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, సూపరింటెం డెంట్ ద్యావళ్ల కిరణ్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, పాల్గొన్నారు.

పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులపై దృష్టిసారించండి

- మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఉమ్మడి జిల్లా పరిధిలోని పెండింగ్ ప్రాజెక్టుల విషయమై ప్రత్యేకంగా దృష్టి సారించాలని రాష్ట్ర భారీ నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్సులో పెండింగ్ ప్రాజెక్టులు, ధాన్యం కొనుగోళ్లపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు అన్ని పెండింగ్ ప్రాజెక్టులను పూర్తిచేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రాజెక్టుల భూసేకరణ విషయమే ఎలాంటి ఇబ్బంది ఎదురైనా తమను సంప్రదించాలని సూచించారు. ఇందుకోసం ప్రత్యేక అధికారులను నియమించామని స్పష్టం చేశారు. పెద్దపల్లి జిల్లాలోని చిన్న కాళేశ్వరం, పత్తిపాక రిజర్వాయర్ నిర్మాణం తదితర అంశాలపై చర్చించారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులను ఏడాదిలోగా పూర్తి చేస్తామని ప్రకటించారు. కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని ప్యాకేజీ -9, 10, 11, 12 మిగతా పనిపూర్తి చేసేందుకు కావలసిన నిధులు మంజూరు చేస్తామని వెల్లడించారు. ధాన్యం సేకరణ త్వరితగతిన పూర్తి చేయాలని, డేటా ఎంట్రీ వేగంగా పూర్తి చేసి రైతుల బ్యాంక్ ఖాతాల్లో రెండురోజుల్లో డబ్బులు పడేలా ఏర్పాట్లు చేయాలని మంత్రి ఆదేశించారు. రాష్ట్ర అవసరాల మేరకు సన్నరకం ధాన్యం సేకరణ పకడ్బందీగా చేయాలని రైతుల ఖాతాల్లో రూపాయలు 500 బోనస్ పేడలా ఏర్పాటు చేయాలని సూచించారు. సంక్షేమ హాస్టల్‌లకు, రెసిడెన్షియల్ పాఠశాలలు, చౌక ధరల దుకాణాలకు సన్న రకం బియ్యం అందిస్తామని చెప్పడం జరిగిందని అన్నారు. సన్నవడ్ల ఎక్కువ మొత్తం లో కొనుగోలు కేంద్రాలకు వస్తున్నందున కొనుగోళ్ళపై దృష్టిపెట్టాలని అన్నారు.

● **84శాతం చెల్లింపులు పూర్తి**

కరీంనగర్ జిల్లాలో ఇప్పటి వరకు 53,512 మెట్రిక్ టన్నుల సన్న రకాలు, 1,23,208 మెట్రిక్ టన్నుల దొడ్డు ధాన్యం కొనుగోలు చేసినట్లు కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. మొత్తం 1,76,720 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులకు సుమారు 345 కోట్ల రూపాయలను చెల్లించినట్లు చెప్పారు. త్వరలోనే మిగతావి చెల్లిస్తామని అన్నారు. సన్న రకాల రైతులకు 11.18 కోట్ల రూపాయల బోనస్ చెల్లించామని తెలిపారు. మూడు రోజుల నుంచి కొనుగోలు కేంద్రాలకు ఎక్కువ మొత్తంలో సన్నవడ్లు వస్తున్నాయని, నూరుశాతం కొనుగోలు పూర్తిచేస్తామని తెలిపారు. వీడియో కాన్ఫరెన్సులో మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్సీ టి జీవన్‌రెడ్డి, పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు, పౌరసరఫరాలశాఖ కమిషనర్ దేవంద్రసింగ్ చౌహాన్, జిల్లా పౌరసరఫరా అధికారి నర్సింగారావు, జిల్లా మేనేజర్ రజనీకాంత్, జిల్లా వ్యవసాయాధికారి విజయభాగ్యలక్ష్మి, డీఆర్‌డీవో శ్రీధర్ పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనకు సహకరించాలి

కరీంనగర్ టౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహ నిర్మూలనకు ప్రతిఒక్కరూ సహకరించాలని మహిళా శిశుసంక్షేమ అధికారులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. బుధవారం నగరంలోని పాఠశాలలు, కళాశాలలు, హాస్టళ్లలో మహిళా శిశుసంక్షేమశాఖ ఆధ్వర్యంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, యూనిసెఫ్ సహకారంతో బాల్య వివాహ నిర్మూలనకు అవగాహన సదస్సులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఆర్ఆర్ కళాశాలల హాస్టల్‌లో డీసీపీవో పర్వీన్ పాల్గొని బాల్యవివాహ నిరోధక చట్టం, బాల్య వివాహాల ద్వారా వచ్చే అనర్థాలను వివరించారు. చైల్డ్ హెల్ప్ లైన్ 1098 జిల్లా కోఆర్డినేటర్ సంపత్ మాట్లాడుతూ బాల్యవివాహాలు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటారని, ఆ వివాహం కూడా చెల్లదని అన్నారు. బాల్య వివాహం గురించి సమాచారం ఉంటే చైల్డ్‌హెల్ప్‌లైన్ 1098 గానీ, 94908811098 నంబర్‌కు కానీ ఫోన్‌చేసి తెలపాలని అన్నారు. కార్యక్రమంలో యూనిసెఫ్ కోఆర్డినేటర్ కిషన్‌స్వామి, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారి రమేశ్, కల్యాణి, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్, విద్యార్థులు పాల్గొన్నారు.

గోదావరి మహా హారతి విజయవంతం చేయాలి

ధర్మపురి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో నవంబరు 30 న శనివారం సాయంత్రం జరిగే గోదావరి మహా హారతి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని గోదావరి హారతి ఉత్సవ సమితా రాష్ట్ర కో కన్వీనర్ దామెర రాంసుధాకర్‌రావు కోరారు. స్థానిక గోదావరి నది మంగళిగడ్డ స్నానఘట్టం వద్ద బుధవారం మహా హారతి కోసం స్థలాన్ని చూసి ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రాంసుధాకర్‌రావు మాట్లాడుతూ దక్షిణ కాశీగా పేరొందిన ధర్మపురి క్షేత్రంలో గత 13 ఏళ్లుగా గోదావరి మహా హారతి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ గోదావరి మహా హారతి కార్యక్రమానికి విశ్వహిందూ మహా సంఘ్ భారత్, శ్రీలంక అద్వైత పీఠాధిపతి, పూజ్యశ్రీ అతిథేశ్వరానంద పర్వత, గోదావరి హారతి ఉత్సవ సమితి వ్యవస్థాపక చైర్మన్, బీజేపీ జాతీయ నాయకులు పోల్సానీ మురళీధర్‌రావు హాజరవుతారని ఆయన పేర్కొన్నారు. వైదిక స్మార్త జ్యోతిష్య పౌరాణికులు, బ్రహ్మశ్రీ పాలెపు భరత్‌శర్మ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమంలో గోదావరి హారతి ఉత్సవ సమితి రాష్ట్ర కన్వీనర్ లింగంపెల్లి వీరగోపాల్, కో కన్వీనర్ బల్గూరి సంతోష్‌రావు తదితరులు హాజరవుతారని ఆయన వివరించారు. కావున అధికసంఖ్యలో భక్తులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

కార్యక్రమంలో గోదావరి హారతి ఉత్సవ సమితి జిల్లా కన్వీనర్ శ్రీనివాస్, సభ్యులు సురేందర్‌రెడ్డి, కందాల నర్సింహమూర్తి, బండారి లక్ష్మణ్, లక్ష్మినర్సయ్యగౌడ్, గోపి, సతీష్, వీహెచ్‌పీ, ఆర్ఎస్ఎస్ నాయకులు కస్తూరి రాజన్న, సంగి నర్సయ్య, బెజ్జారపు లవణ్, బండారి లక్ష్మణ్, దొనకొండ నరేష్, నలుమాసు వైకుంఠం, గాజు భాస్కర్, తిరుమన్‌దాసు సత్యనారాయణ, అప్పం మల్లేష్, దివిటి శ్రీధర్, పల్లెర్ల సురేందర్, కాశెట్టి హరీష్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ఆశ్రమాలకు మోక్షమెప్పుడో..?

- నత్తనడకన వృద్ధుల, అనాథ ఆశ్రమ భవనాల నిర్మాణ పనులు
- కలెక్టర్ ఆదేశాలు సైతం బేఖాతరు



బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వేసిన శిలాఫలకం

సుల్తానాబాద్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అనాథలు, వృద్ధులకు ఆశ్రయం కల్పించేందుకు మంజూరైన ఆశ్రమాలకు మోక్షం కలగడం లేదు. రెండేళ్లు కావస్తున్నా నిర్మాణ పనులు పూర్తి కావడం లేదు. గత ప్రభుత్వ హయాంలో పనులు చేపట్టడానికి ఆనాటి మంత్రి, ఎమ్మెల్యే తదితరులు శంకుస్థాపనలు చేశారు. ఒక భవనం పనులు ప్రారంభమైనా అ సంపూర్తిగానే మిగిలిపోయింది. కొత్తగా కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక పనుల్లో వేగం పెంచినా ఇంకా పనులు పూర్తి దశకు చేరుకోలేదు. అనాథాశ్రమం భవన సముదాయం పనులు అసంపూర్తిగా ఉన్నాయి. ఇంటీరియర్‌తో పాటు ప్రహరీ గోడల నిర్మాణాలు, సెప్టిక్ ట్యాంక్ వంటి పనులు పెండింగ్‌లో ఉన్నాయి. సత్వరం పనులు చేపట్టేందుకు కలెక్టర్లు సైతం ఇక్కడి పనులను పరిశీలించారు. 24 జనవరి 2023న శంకు స్థాపనలు జరిగిన ఈ భవన నిర్మాణాలు 15 మార్చి 2024లోగా పనులు పూర్తి కావాలని కలెక్టర్ పరిశీలించి అధికారులు, కాంట్రాక్టర్లను ఆదేశించారు. కానీ అవి కార్య రూపం దాల్చడంలేదు. దాదాపు రూ.70 లక్షల వ్యయంతో సుల్తానాబాద్ పట్టణంలోని మార్కండయ్య కాలనీ సమీపంలో పెరికిగిద్దె ఆంజనేయ స్వామి ఆలయం పక్కన వీటి నిర్మాణం చేపట్టారు. జిల్లాలోని మూడు పెద్దపల్లి, మంథని, రామగుండం నియోజక వర్గాల పరిధిలోని వృద్ధులకు ఆశ్రయం కల్పించే వీలుగా వారికి అవసరమైన వసతి సౌకర్యాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.



ప్రారంభోత్సవానికి నోచుకోని అనాథ ఆశ్రమం

ఒకే ప్రాంగణంలో వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్

మార్కండేయ్య కాలనీలో చేపట్టిన నిర్మాణ ప్రాంతంలో ఒకే చోట పలు సంక్షేమ భవనాలతో పాటు వృదాశ్రమం, వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్ వంటివి ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులు నిర్ణయిం చారు. ఆ ప్రకారంగా నిర్మాణాలు చేపట్టినా అవి నత్తనడకన సాగుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి నిర్మాణ పనులు త్వరగా పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

న్యూస్ బాక్స్

బాధిత కుటుంబాలకు మంత్రి శ్రీధర్‌బాబు పరామర్శ

మంథని, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని పలు బాధిత కుటుంబాలను మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పరామర్శించారు. సీతారామ సేవా సదన్ గౌరవ అధ్యక్షుడు సువర్ణ లక్ష్మణ్‌రావు ఇటీవల మృతిచెందగా శ్రీధర్‌బాబు బాధిత కుటుంబానికి సానుభూతి ప్రకటించారు. రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ మారుపాక నాగరాజును మంత్రి పరామర్శించారు. ఆయన వెంటన మున్సిపల్ చైర్‌పర్సన్ పెండ్రి రమ-సురేష్‌రెడ్డి, నేతలు వొడ్నాల శ్రీనివాస్, ప్రసాద్ ఉన్నారు.

ఆయిల్‌పామ్ తోటల పరిశీలన

ముత్తారం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సర్వారం, ఖైదంబండ గ్రామాల్లోని గుజ్జుల రాజిరెడ్డి, ఏర్రం సమ్మయ్యలు సాగు చేసిన ఆయిల్‌పామ్ తోటలను ఉద్యానవన శాఖ అధికారి జ్యోతి బుధవారం పరిశీలించారు. రైతులకు ఆయిల్‌పామ్ సాగుపై సలహాలు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డీడీఎం జయప్రకాశ్, ఫీల్డ్‌అధికారి ప్రీతమ్ పాల్గొన్నారు.

శ్మశానవాటికలో స్వచ్ఛ కార్యక్రమం

సుల్తానాబాద్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని పూసాల స్మశాన వాటికలో బుధవారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో స్వచ్ఛ కార్యక్రమం నిర్వహించారు. చెత్తాచెదారాన్ని ఎక్స్‌కవేటర్‌తో తొలగించారు. లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు మాటేటి సంజీవ్‌కుమార్, జిల్లా కోఆర్డినేటర్ ప్రవీణ్ నీలయ్య, సుధీర్‌రావు ఉన్నారు.

కారు, లారీ ఢీ..

పాలకుర్తి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : మండలం పరిధిలోని బసంత్‌నగర్ రైల్వే ట్రాక్ వద్ద బుధవారం లారీ, కారు ఢీకొన్నది. పెద్దపల్లి నుంచి గోదావరిఖని వైపు వెళ్తున్న కారును వెనుక నుంచి వస్తున్న లారీ ఢీకొన్నట్లు స్థానికులు తెలిపారు.

గడువులోపు బోనస్ చెల్లించాలి

పాలకుర్తి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): బసంత్‌నగర్ కేశోరాం సిమెంటు కర్మాగారంలో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు కార్మికులకు గడువులోపు మెరుగైన బోనస్ చెల్లించాలని బుధవారం కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు కౌశిక హరి అన్నారు. ఈ మేరకు ప్లాంట్ హెడ్ శ్రీనివాసరెడ్డిని కలిసి సమ్మె సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. వెంట యూనియన్ ప్రధానకార్యదర్శి మాదాసు శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

సెపక్ తక్రా రాష్ట్ర ఉపాధ్యక్షుడికి సన్మానం

రామగిరి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): సెపక్‌తక్రా రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన పూదరి సత్యనారాయణగౌడ్‌ను బీఆర్‌ఎస్ నాయకులు జక్కు రాకేష్, శంకేషి రవీందర్, కాపురబోయిన భాస్కర్‌లు ఆయన నివాసంలో ఘనంగా సత్కారించారు. ఈ కార్యక్రమంలో ఎండి ఇబ్రహీం, బుర్ర శంకర్‌గౌడ్, రోడ్డ శ్రీనివాస్, మట్టరాజులు ఉన్నారు.

రేపు శివాజీ విగ్రహావిష్కరణ

ఓదెల నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కనగర్తిలో నిర్మించిన ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహాన్ని 29న ఆవిష్కరించనున్నారు. రాష్ట్ర సామాజిక సమరసత కన్వీనర్ అప్పల ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై విగ్రహాన్ని ఆవిష్కరిస్తారని నిర్వాహకులు ఆది సతీష్, కందునూరి సాయి వర్షిత్ తెలిపారు. అందరూ స్వచ్ఛందంగా పాల్గొని విగ్రహావిష్కరణ వేడుకను విజయవంతం చేయాలని కోరారు.

ఉచిత దంత వైద్య పరీక్షలు

కోల్‌సిటీటౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : గోదావరిఖని అడ్డగుంటపల్లిలోని శ్రీరామ విద్యానికేతన్‌లో బుధవారం శ్రీకాంత్ డెంటల్ ఆధ్వర్యంలో ఉచిత దంత పరీక్షలు నిర్వహించారు. వైద్యులు రేణుక, సిరిచందన పలు సూచనలు చేశారు.

బాల్య వివాహాలతో భవిష్యత్ అంధకారం

కోల్‌సిటీ, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలతో భవిష్యత్ అంధకారమవుతుందని గోదావరిఖని జిల్లా 6వ అదనపు న్యాయమూర్తి శ్రీనివాసరావు అన్నారు. బుధవారం మండల న్యాయసేవా అధికారిక సంస్థ ఆధ్వర్యంలో అదనపు జిల్లా న్యాయస్థానం ఆవరణలో నిర్వహించిన బాల్ వివాహ్ ముక్తి భారత్ సదస్సులో న్యాయమూర్తి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. విద్యార్థులు చదివే వయసులో వివాహం చట్టరీత్యా నేరమన్నారు. దేశాభివృద్ధి బాల్య వివాహాలతో అంధకారంలోకి వెళుతుందన్నారు. ఈ కార్యక్రమంలో లోక్ అదాలత్ సభ్యురాలు శైలజ, పులిపాక శ్రీనివాస్, సీడబ్ల్యూసీ చైర్మన్ శ్రీధర్ పాల్గొన్నారు.

● పెద్దపల్లిటౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు బుధవారం ప్రభుత్వ గర్ల్ హైస్కూల్లో బాల వివాహ ముక్త్ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ సందర్భంగా న్యాయమూర్తులు మాట్లాడారు. ఆడపిల్లలకు 21 ఏళ్లు నిండిన తరువాతనే వివాహాలు చేస్తే చట్టపరంగా ఎలాంటి నష్టం ఉండదన్నారు. అలాగే బాల్య వివాహాలు చేసినవారికి, చేసుకున్నవారికి, చేయించినవారికి కూడా 2 సంవత్సరాల వరకు శిక్ష విధించవచ్చని లేదా లక్ష రూపాయల వరకు జారిమాన పడుతుందని వివరించారు. బాల్య వివాహాల నియంత్రణకు కృషి చేయాలని, ఎక్కడైనా బాల్య వివాహాలు చేసేందుకు ఒత్తిడి తెస్తే జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కానీ, తహసీల్దార్ కార్యాలయంలో కానీ, పోలీస్‌శాఖకు కానీ, 15100కు ఫోన్ చేసి తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జీలు బీ శ్రీనివాసులు, మంజుల, అరుణ, ప్రభుత్వ నాయయవాది డీవీఎస్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న న్యాయమూర్తి శ్రీనివాసరావు

రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు మోడల్ స్కూల్ విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ధర్మారం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో 7వ, తరగతి చదువున్న ఎస్.ఇంద్ర ప్రియదర్శిని, ఆర్.అర్చన, కె.నరేన్ కార్తికేయలు రాష్ట్ర స్థాయి హాకీ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ఈరవేణి రాజ్‌కుమార్ తెలిపారు. వీరు ఈనెల 29న, సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో జరిగే రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ అండర్14 విభాగంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా తరుపున ఆడనున్నారు. వ్యాయామ ఉపాధ్యాయుడు బైకెని కొమురయ్య, మేకల సంజీవ్, ఉపాధ్యాయులు అభినందించారు.

క్రిసెంట్ పాఠశాల విద్యార్థుల ప్రతిభ

కాల్వశ్రీరాంపూర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని క్రిసెంట్ పాఠశాల విద్యార్థులు ఈనెల 24న పెద్దపల్లి జూనియర్ కళాశాలలో జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన క్రీడాపోటీల్లో ప్రతిభను కనబరిచారు. రన్నింగ్, జావలింగ్‌త్రో పోటీల్లో రెండు గోల్డ్ మెడల్, ఒక సిల్వర్ మెడల్‌తో పాటు కోకో, కబడ్డీ, చెస్, పోటీల్లో 11మంది విద్యార్థులు మెడల్స్ సాధించినట్లు పాఠశాల సీఈవో తహబిల్లాల్ సయ్యద్ తెలిపారు. పాఠశాలలో విద్యార్థులను అభినందించి మెడల్స్ అందజేశారు. ప్రిన్సిపాల్ నసీర్, ఉపాధ్యాయులు జాఫర్, పీటీ నాజీప్ పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ గెలుపునకు కృషి

కళ్యాణ్‌నగర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ గెలుపునకు కృషి చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గొట్టిముక్కుల సురేష్‌రెడ్డి అన్నారు. బుధవారం గోదావరిఖని మార్కండేయకాలనీలోని ఓ ఫంక్షన్ హాల్‌లో జరిగిన బీజేపీ ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రామగుండం అసెంబ్లీ నియోజకవర్గంలో బీజేపీ బలంగా మారిందని, పంచాయతీ, కార్పొరేషన్ ఎన్నికల్లో కాషాయ జెండా ఎగురవేస్తామన్నారు. ఎన్నికల్లో కార్యకర్తలందరూ సమిష్టిగా పనిచేయాలని, ప్రతి కార్యకర్త ఇంటింటికి వెళుతూ నరేంద్ర మోదీ ప్రవేశపెడుతున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. క్రియాశీలక సభ్యత్వ నమోదు చేసిన వంద మంది కార్యకర్తలను అభినందించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు సోమారపు లావణ్య కాసిపేట శివాజీ, పెద్దపల్లి రవీందర్, సుల్వ లక్ష్మీనర్సయ్య, మహవాది రామన్న, దాసరి శ్రీని వాస్, మూకిరి రాజు, మంజుల, వసంత, లక్ష్మి, స్వరూప, గోపగోని నవీన్, శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి ఘన నివాళి

దర్మారం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల కలుషిత ఆహారం తిని మరణించిన విద్యార్థిని శైలజకు బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రాచూరి శ్రీధర్ ఆధ్వర్యంలో మౌనం పాటించి నివాళులర్పించారు. జిల్లా కార్యాలయంలో జరగబోయే దీక్షా దివస్ కార్యక్రమానికి బీఆర్‌ఎస్ కార్యకర్తలు, నాయకులు, తెలంగాణ ఉద్యమకారులు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పూస్కూరి జితేందర్ రావు, గుర్రం మోహన్‌రెడ్డి, తుమ్మల రాంబాబు, మిట్ట తిరుపతి, ఆవుల శ్రీనివాస్, ఆవుల లత, కాంపెల్లి చంద్రశేఖర్, కొత్త మోహన్, ఐతె వెంకటస్వామి, కూరపాటి శ్రీనివాస్, దేవి నళినికాంత్, ఎండి రఫి, దేవి వంశీ, దేవి మల్లేశం పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలి

సుభాష్‌నగర్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మాదిగ, మాదిగ ఉపకులాల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. బుధవారం నగరంలోని దుర్గమ్మగడ్డలో ప్రారంభమైన ర్యాలీ అంబేద్కర్ కమ్యూనిటీ హాల్ మీదుగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వరకు చేరుకున్నది. ఎస్సీ వర్గీకరణ అమలు చేస్తూ అసెంబ్లీలో తీర్మానం చేయాలని ముఖ్యమంత్రిని కోరారు.

అవినీతికి తావులేదు

కాల్వశ్రీరాంపూర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మత్స్యసహకార సొసైటీలో అవినీతికి తావులేదని అధ్యక్షుడు దాసరి మల్లేష్ అన్నారు. పందిళ్లలో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సొసైటీపై కొందరు ఆరోపణలు చేస్తూ బురద చల్లుతున్నారన్నారు.సొసైటీ ఆధ్వర్యంలో పెద్దమ్మ ఆలయ నిర్మాణంకు ప్రతి ముదిరాజ్ కుటుంబం నుంచి గ్రామంలో ఒక్కొక్క ఇంటికి 5వేల రూపాయలు విరాళంగా ఇచ్చారన్నారు. ఉపాధ్యక్షుడు కందుల మల్లేష్, కార్యదర్శి బండి రవి, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు

పాలకుర్తి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వేమునూర్ గ్రామంలో బుధవారం వేంకటేశ్వరస్వామి సహిత అలివేలుమంగ కళ్యాణం, బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. మండలంలోని పలు గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరై కళ్యాణాన్ని తిలకించారు. ఈ సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు.



కల్యాణం జరిపిస్తున్న వేద పండితులు

కొలువుల దందా..

(5వ పేజీ తరువాయి)

ఎదురవడంతో బాధితులు పైరవీకారులను నిలదీస్తున్నారు. నేరుగా దాణాలను ఆశ్రయిస్తున్నారు. నాలుగు రోజుల క్రితం గోదావరిఖనిలో ఒక ప్రధాన జాతీయ కార్మిక సంఘం అగ్ర నాయకున్ని ఆ సంఘంలో సాంస్కృతిక విభాగంలో కీలకంగా పనిచేస్తున్న కార్మికుడు నిలదీశాడు. తనను మెడికల్ అన్‌ఫిట్ చేయిస్తానని రూ.4 లక్షలు తీసుకుని మోసం చేశావని, డబ్బులు తిరిగి ఇవ్వాలంటూ కారుకు అడ్డంగా పడుకున్నాడు. కార్యాలయం ముందటే ఆ యూనియన్ అనుబంధ సంఘాల నాయకులు చూస్తుండగా ఈ ఘటన జరగడంతో సదరు నాయకుడు ఖంగుతిన్నాడు. ఇప్పటికే సదరు నాయకుడు గోదావరిఖని, శ్రీరాంపూర్‌లలో గనుల స్థాయి అధికారులను మధ్యవర్తులుగా పెట్టుకుని కోట్లు దండుకున్నట్టు ఆరోపణలున్నాయి. రామగుండం డివిజన్-1లోని ఒక పెద్ద గనికి సంబంధించే ఐదుగురు బాధితులు సదరు నాయకుడి మధ్యవర్తికి డబ్బులు ఇచ్చి లబోదిబోమంటున్నారు. యూనియన్ కార్యాలయం ముందే ఈ ఘటన జరుగడంతో తెల్లవారే సదరు బాధితున్ని రాజీ చేసుకున్నట్టు తెలుస్తోంది. మరో ఇద్దరు కార్మిక నాయకులపై సైతం బాధితులు పోలీసులను ఆశ్రయించినట్టు తెలిసింది.

● **ఎన్‌టీపీసీ, కార్పొరేషన్‌లలోనూ అదే తంతు..**

ఆర్‌ఎఫ్‌సీఎల్‌లో కొలువుల పేర రూ.30కోట్ల దందా జరిగి ముగ్గురు కార్మికులు మరణించినా ఇక్కడి ఉద్యోగాల దందా ఆగడం లేదు. ప్రస్తుత పాలకవర్గంలో రామగుండం మున్సిపల్ కార్పొరేషన్‌లో పనులు పెట్టిస్తామని పలువురు కార్పొరేటర్లు, కార్మిక నాయకులు, ఉద్యోగులు, పలువురు నాయకులు పెద్దఎత్తున డబ్బులు దండుకున్నారు. పనులు కాకపోగా ఉన్న పనులు ఊడిపోయాయి. ఆరు నెలలు పని చేసిన కాలానికి కూడా జీతాలు రాని పరిస్థితి. రేపుమాపు అంటూ కొందరు కార్మిక నాయకులు కాలయాపన చేస్తున్నారు. రామగుండం మున్సిపల్ కార్పొరేషన్‌లో ఆర్థిక పరిస్థితి దృష్ట్యా కొత్తగా పనులు పెట్టుకునేది లేదని ఉన్నతాధికారులు కరాఖండిగా చెప్పారు. ఒక ప్రజాప్రతినిధికి కార్పొరేషన్ కింది స్థాయి ఉద్యోగులే మధ్యవర్తులుగా ఉండి మూడేళ్ల క్రితం రూ.4లక్షలు ఇవ్వడంతో ఆ డబ్బులు తిరిగి ఇవ్వకపోవడంతో పోలీసులను ఆశ్రయించారు. మరో ప్రజాప్రతినిధి డబ్బులు ఇవ్వకపోవడంతో పోలీసులను ఆశ్రయించగా సదరు ప్రజాప్రతినిధి మరి కొందరు పేర్లు చెప్పడంతో పోలీసులు తీవ్రంగా మందలించినట్టు తెలుస్తోంది. దీంతో 75శాతం సొమ్ము వాపసుఇచ్చారు. ఇలా ఒక కార్పొరేషన్‌లోనే 20మందికిపైగా బాధితులు ఉన్నట్టు పోలీస్ వర్గాలే పేర్కొంటున్నారు. ఇక ఎన్‌టీపీసీలో తెలంగాణ పవర్ ప్లాంట్‌లో ఉద్యోగాలు అంటూ లక్షల రూపాయలు వసూలు చేశారు. లోకేషన్ల పేరు చెప్పి కొందరు కాంట్రాక్టర్లు మధ్యవర్తులను పెట్టి ఉద్యోగానికి రూ.3లక్షలు అంటూ రేట్లు పెట్టి దండుకున్నారు. కొత్త లోకేషన్‌లలో మూడు నాలుగు పనులు ఉంటే పది ఇరవై మంది వద్ద వసూళ్లకు పాల్పడ్డారు. పనుల వద్దకు వెళ్లే సరికి పరిస్థితులు మారిపోయాయి. రేపు మాపు అంటూ కాలయాపన చేస్తూ తప్పించుకుంటున్నారు. దీంతో బాధితులు పోలీసులను ఆశ్రయిస్తున్నారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోండి

- ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి సూర్య



కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

కోల్‌సిటీ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : రామగుండం కార్పొరేషన్‌లో అక్రమ నిర్మా ణాలపై చర్యలు తీసుకోవాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి మార్కపురి సూర్య కమిషన ర్ అరుణశ్రీకి బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ కాజిపల్లిలోని ఓ ఫంక్షన్‌హాల్ వెనుక ఎలాంటి అనమతులు లేకుండా భవనా న్ని నిర్మించారని, అంతేకాకుండా గ్రౌండ్ ఫ్లోర్ అనుమతితో అక్రమంగా సెల్లార్ నిర్మి స్తున్నారన్నారు. రామగుండం కార్పొరేషన్‌లో అనేక మంది అక్రమంగా భవనాలు ని ర్మించారని, వీటికి అనుమతులు ఇచ్చిన టౌన్‌ప్లానింగ్ అధికారులపై చర్యలు తీసుకో వాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో సాదుల శివ, ఆసాల నవీన్, సుధీ ర్ కుమార్ ఉన్నారు.

పెండింగ్ కేసులను త్వరగా పరిష్కరించాలి



రికార్డులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

ముత్తారం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఉన్న పెండింగ్ కేసులను వెంటనే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ వేణు అన్నారు. బుధవారం ఆయన మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం, ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఆరోగ్య కేంద్రంలో పలు మరమ్మతులు చేయించాలని వైద్యులు కోరారు. అలాగే సింగిల్‌విండో ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రాలు పారుపల్లి, ముత్తారం పరిశీలించారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని వెంటవెంటనే తరలించాలని సూచించారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సుమన్, నాయబ్ తహసీల్దార్ షఫీ, ఆర్ఐ శ్రీధర్, సీనియర్ సహాయకులు భవానీప్రసాద్, కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

ఉచిత కంటి చికిత్స కోసం తరలి వెళ్లిన గ్రామస్తులు

ఓదెల నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రానికి చెందిన 31 మందిని బుధవారం కంటి వైద్య చికిత్స కోసం మాజీ ఎంపీటీసీ బోడకుంట శంకర ఆధ్వర్యంలో కరీంనగర్‌లోని చెల్మెడ ఆనందరావు ఆసుపత్రికి తరలించారు. రెండు రోజుల క్రితం ఓదెలలో నిర్వహించిన కంటి వైద్య చికిత్స శిబిరానికి 300 మంది హాజరుకాగా సమయం లేకపోవడంతో మిగతా గ్రామస్తులకు వైద్యం అందలేదు. దీంతో గ్రామస్తులందరిని సమీకరించి కంటి వైద్య చికిత్స కోసం తరలించారు.

ఈ కార్యక్రమంలో నేత్ర వైద్య నిపుణులు పూదరి దత్త గౌడ్, డాక్టర్లు అనురాగ్ పవార్, శుభం, డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ పల్కపాటి రాజేష్ కుమార్, లెగిశెట్టి వంశీ, ఆర్ఎంపీ సర్వర్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యమకారులకు న్యాయం చేయాలి



మహాపాదయాత్రకు తరలిన ఉద్యమకారులు

సుల్తానాబాద్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమకారులకు న్యాయం చేయాలని, వారి సంక్షేమానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఉద్యమకారులు డిమాండ్ చేశారు. కరీంనగర్‌లో తెలంగాణ ఉద్యకారుల ఫోరమ్ తలపెట్టిన తెలంగాణ ఉద్యమకారుల మహా పాదయాత్రకు జిల్లా అధ్యక్షులు గుండేటి ఐలయ్య యాదవ్ ఆధ్వర్యంలో బుధవారం సుల్తానాబాద్ నుంచి తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఉద్యమకారులు విలేకరులతో మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తాము పదమూడేళ్ల ఉద్యమాలు చేశామని తిండి తిప్పలు మాని నిద్రకు నోచుకోక అష్టకష్టాలు పడ్డామని గుర్తు చేశారు. ఈ ప్రజా ప్రభుత్వంలోనైనా సీఎం రేవంత్‌రెడ్డి తమకు న్యాయం చేకూర్చాలని డిమాండ్ చేశారు. ఉద్యమకారులు గుర్తించి వారికి తలా 250 గజాల ఇంటి స్థలాలు ఇస్తామని సీఎం చెప్పారని అన్నారు. వెంటనే సంక్షేమ బోర్డ్‌ను ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నూనె రాజేశం, రాజిరెడ్డి, విజయ్ కుమార్, రాజు, ప్రతాప్, తిరుపతి, చేరాలు, శంకరయ్య, తిరుపతిరెడ్డి, సదాశివ, తదితరులు పాల్గొన్నారు.



యంత్రాల సామర్థ్యాన్ని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలి

- ఏపీఏ జీఎం వెంకటేశ్వర్లు



నూతనంగా కొనుగోలు చేసిన యంత్రం

రామగిరి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): యంత్రాల సామర్థ్యాన్ని పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని ఏపీఏ జీఎం వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం ఏపీఏ డివిజన్ పరిధిలోని అడ్రియాల ప్రాజెక్టులో నూతనంగా కొనుగోలు చేసిన జీసీఎల్215కు చెందిన ఎఫ్‌బీఎల్(డీజిల్) యంత్రాన్ని అడ్రియాల ప్రాజెక్టు ఏరియా జీఎం వెంకటేశ్వర్లు లాంచనంగా ప్రారంభించారు. యంత్రాల సామర్థ్యాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకుంటూ భద్రతతో కూడిన ఉత్పత్తి లక్ష్యాలను చేరుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు అధికారి కొలిపాక నాగేశ్వర్‌రావు, మేనేజర్ జనార్ధన్, ప్రాజెక్టు ఇంజనీర్ రఘురాం, అధికారులు పాల్గొన్నారు.

ఏఎల్‌సీని కలిసిన పర్సనల్ అధికారి

రామగిరి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల రీజియన్ నూతన అసిస్టెంట్ లేబర్ కమిషనర్(సెంట్రల్)గా ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన ఎండీ యూసుఫ్‌ను బుధవారం ఆర్జీ-3 పర్సనల్ అధికారి సుదర్శనం మర్యదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శాలువతో సత్కరించారు. అనంతరం ఆర్జీ-3 ఏరియాలో పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారానికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐఈ డీజీఎం చంద్రశేఖర్, రాజేశం తదితరులు పాల్గొన్నారు.

వృత్తి శిక్షణ తరగతులు ప్రారంభం

గోదావరిఖని, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఆర్జీ-1 ఏరియా సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతులు, మహిళలకు సామాజిక బాధ్యత, స్వయం ఉపాధి కల్పనలో భాగంగా బుధవారం వృత్తి శిక్షణ కేంద్రాలను నెలకొల్పారు. ఈ కార్యక్రమాన్ని సేవా అధ్యక్షురాలు అనిత లలిత్‌కుమార్, ఆర్జీ-1 జీఎం లలిత్ కుమార్ ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. టైలరింగ్, మగ్గం వర్క్స్, బ్యూటీషియన్, ఫ్యాషన్ డిజైనింగ్ తదితర 15 వృత్తి శిక్షణ కేంద్రాలను ప్రారంభించారు. అలాగే గత సంవత్సరం వృత్తి శిక్షణ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన 18మంది అభ్యర్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా అనిత మాట్లడుతూ ప్రస్తుత సమాజానికి అనుగుణంగా ప్రతి ఒక్కరు తమ కాళ్ల మీదా తాము నిలబడానికి వివిధ వొకేషనల్ ట్రైనింగ్ పొందుతున్నారని, సమాజంలో వివిధ ఫ్యాషన్‌తో కూడిన డిజైన్లు కొనుగోలు చేయడానికి ఖర్చుకు వెనుకాడటం లేదన్నారు. ఫ్యాషన్‌తో కూడిన కుట్లు అల్లికలు, మగ్గంవర్క్స్, అందంగా అలంకరించడానికి బ్యూటీషియన్‌లాంటి వాటికి ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. ఇటువంటి వాటిలో శిక్షణ ఇచ్చేందుకు సింగరేణి సంస్థ ఖర్చుకు వెనుకాడడం లేదన్నారు. మార్కెట్‌కు అనుగుణంగా వివిధ శిక్షణలు పొందాలని, ప్రతిఒక్కరు శ్రద్ధతో మెళకువలు నేర్చుకొని ప్రావీణ్యం సాధించి సొంతంగా యూనిట్స్ నెలకొల్పుకొని స్వయంఉపాధి పొందాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ డిప్యూటీ సెక్రెటరీ మడ్డి ఎల్లయ్య, సీఎంఓ ఐఏ ప్రతినిధి శ్రావణ్ కుమార్, ఎస్ఓటూ జీఎం గోపాల్ సింగ్, డీజీఎం(పర్సనల్) డీ కిరణ్ బాబు, హన్మంతరావు, సీనియర్ పర్సనల్ ఆఫీసర్, సేవా సమితి సెక్రెటరీ శిరీష, బీనా సింగ్, లేడీస్ క్లబ్ సెక్రెటరీ చిలుక లక్ష్మి, సభ్యులు రశ్మిసింగ్, కళ్యాణి, మేడి తిరుపతి, శిక్షకులు పాల్గొన్నారు.



సర్టిఫికెట్లు అందజేస్తున్న సేవా అధ్యక్షురాలు అనితలలిత్‌కుమార్

పదోన్నతి పొందిన అధికారికి సన్మానం

గోదావరిఖని, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఆర్జీ-1 ఏరియా పర్సనల్ మేనేజర్‌గా పని చేస్తున్న కిరణ్ బాబుకు డీజీఎం(పర్సనల్)గా పదోన్నతి లభించినది. ఈ సందర్భంగా కిరణ్ బాబును బుధవారం ఆర్జీ-1 స్కౌట్స్ అండ్ రోవర్స్ డిస్ట్రిక్ట్ ఆర్గనైజింగ్ కమిషనర్, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ బంగారు సారంగపాణి, స్కౌట్ రోవర్స్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆర్జీ-1 స్కౌట్స్ అండ్ రోవర్స్ బుచ్చయ్య, దొడ్డి కుమార్, గుంటి కుమార్, టీ కుమార్ పాల్గొన్నారు.

మహిళా ఉద్యోగులకు కౌన్సెలింగ్

యైటింక్లయిన్‌కాలనీ, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ఆర్జీ-3 ఏరియా ఓసీపీ-1 ప్రాజెక్టు వివిధ విభాగాల్లో విధులు నిర్వహిస్తున్న మహిళా ఉద్యోగులకు బుధవారం అధికారులు కౌన్సెలింగ్ నిర్వహించారు. మహిళా జనరల్ మజ్దూర్‌లు, బదిలీ వర్కర్లకు సర్ఫేస్‌లోగల సర్ఫేస్‌లో 16 డిసిగ్నేషన్‌లలో ఉద్యోగాల గురించి కమిటీ కన్వీనర్ ఎస్వోటూ జీఎం రఘుపతి వివరించారు. స్టోర్స్, సీహెచ్‌పీ, మేనేజర్ కార్యాలయం, పీవో ఆఫీస్‌లలో డిసిగ్నేషనల్ గురించి వివరించారు. ఎంచుకున్న ఉద్యోగాలకు శిక్షణ తర్వాత పంపడం జరుగుతుందన్నారు. ప్రాజెక్ట అధికారి రాజశేఖర్, డీజీఎం(ఐఈ) చంద్రశేఖర్, పర్సనల్ డీజీఎం సుదర్శనం, అధికారులు డాక్టర్ కళ్యాణ చక్రవర్తి, సునీల్ ప్రసాద్ పాల్గొన్నారు.

పెండింగ్ సమస్యలు పరిష్కరించాలి

యైటింక్లయిన్‌కాలనీ, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం అయ్యేలా గురువారం జరగనున్న డైరెక్టర్ స్థాయి స్ట్రక్చర్ సమావేశాల్లో గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు యాజమాన్యంపై ఒత్తిడి తేవాలని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ జనరల్ సెక్రెటరీ మంద నరసింహారావు ప్రకటనలో పేర్కొన్నారు. గెలిచిన సంఘాలు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయడం, ఆర్థికంగా నష్టం కలిగించే అంశాలను యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. జేబీసీసీఐలో పెర్క్స్‌పై ఐటీ రీయింబర్స్ చేయాలని ఒప్పందం జరిగినా సింగరేణిలో కార్మికులకు అమలు చేయడం లేదని, పెర్క్స్‌పై ఐటీ రీయింబర్స్ చేయించాలని గెలిచిన సంఘాలకు నరసింహారావు సూచించారు. కార్మికుల సొంత ఇంటి పథకం అమలులో భాగంగా ఇళ్ల స్థలాలు కేటాయించేలా యాజమాన్యాన్ని ఒప్పించాలని సూచించారు. మారు పేర్లతో ఉన్న కార్మికుల పేర్ల మార్పిడి దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్నదని, ఒకేదఫాలో పేర్ల మార్పిడి చేసేలా యాజమాన్యాన్ని ఒప్పించాల్సిన బాధ్యత గెలిచిన సంఘాలపై ఉన్నదని అన్నారు. పెండింగ్‌లో ఉన్న ఈపీ ఆపరేటర్ల ప్రమోషన్లు బ్యాక్ డేట్‌తో ఇప్పించడం, ప్లేడే పీహెచ్‌డీలపై ఆంక్షలను ఎత్తివేసేలా యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లాలని గుర్తింపు ప్రాతినిధ్య సంఘాలకు నరసింహారావు సూచించారు.

మేడిపల్లి సర్వేపై రైతుల అభ్యంతరాలు



తహసీల్దార్ ఎదుట అభ్యంతరాలను వెల్లడిస్తున్న రైతులు, గ్రామస్థులు

రామగిరి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రత్నాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని మేడిపెల్లి శివారులో ప్రభుత్వ అసైన్డ్, పట్టా భూముల సర్వేపై బుధవారం స్థానిక రైతులు, గ్రామస్థులు అభ్యంతరాలు వ్యక్తం చేశారు. మేడిపల్లి శివారులోని చేస్తున్న సర్వే పనులను అడ్డుకున్నారు. ఈ సమాచారం అందుకున్న తహసీల్దార్ ఫీల్డ్ విజిట్ చేశారు. ఈ సందర్భంగా రైతులు పలు అభ్యంతరాలు వ్యక్తం చేశారు. ఇండస్ట్రియల్ పార్క్‌పై రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించిన తర్వాతే సర్వే పనులు చేపట్టాలని తహసీల్దార్ రాంచందర్‌రావును కోరారు. ప్రజల అభ్యంతరాలను విన్న తహసీల్దార్ కలెక్టర్ దృష్టికి తీసికెళ్తామన్నారు.